కొప్పోలు పవర్ ప్రాజెక్టు సామర్థ్యం పెంపునకు ఆమోదం

కొండాపురం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): కొండాపురం మండలంలోని కొప్పోలు పొలం వద్ద ఏర్పాటుచేయనున్న పంప్డ్ స్టోరేజీ పవర్ ప్రాజెక్టును 360 మెగావాట్ల నుంచి 2400 మెగావాట్లకు పెంచేందుకు రాష్ట్ర కేబినెట్ ఆమోదముద్ర వేసింది. కొప్పోలు వద్ద చింతా గ్రీన్ ఎనర్జీ అనే సంస్థ ఈ పవర్ ప్రాజెక్టును చేపట్టనుంది. ఈ పంప్డ్ స్టోరేజీ పవర్ ప్రాజెక్టుకు పక్కనే ఉన్న గండికోట జలాశయం నుంచి నీటిని వాడుకునేందుకు, నీటి కేటాయింపునకు కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది. అదేవిధంగా జమ్మలమడుగు, ముద్దనూరు మండలాల్లోని 100 మెగావాట్ల విండ్‌పవర్ ప్రాజెక్టులకు, మైలవరం మండలంలో 60 మెగావాట్ల హైబ్రిడ్ విండ్ సోలార్ పవర్ ప్రాజెక్టుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. కాగా ఇప్పటికే ఆదానీ సంస్థ మండలంలోని దొంతికోన సమీపంలో సుమారు 2000 మెగావాట్ల సామర్థ్యంతో పంప్డ్ స్టోరేజీ పవర్ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టింది.

10న 'ఈషా' యోగా పరిచయ కార్యక్రమం

అమరావతి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): యోగాతో భావోద్వేగాల నియంత్రణ, మానసిక ప్రశాంతతో పాటు అనేక ఆరోగ్య ప్రయోజనాలు పొందేలా ఇన్నర్ ఇంజనీరింగ్ పేరుతో సద్గురు ఓ కార్యక్రమం రూపొందించారు. ఈ యోగా కార్యక్రమం తిరుపతి, గుంటూరు, కాకినాడ, అనంతపురం, చిత్తూరు, కర్నూలు, కడప కేంద్రాలలో తెలుగులో నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా 21 నిమిషాల శాంభవి మహాముద్ర క్రియ చేయడం ద్వారా లక్షల మంది ఎన్నో ప్రయోజనాలను పొందారని, దీనికి సంబంధించిన వివరాల కోసం ఈ నెల 10న జరిగే ఉచిత పరిచయ కార్యక్రమానికి హాజరుకావాలని ఈషా ఫౌండేషన్ ఓ ప్రకటనలో తెలిపింది. isha.co/ieapt లేదా 04041896666 నంబరులో సంప్రదించాలని సూచించింది.

వేడుకగా మిలాద్-ఉన్-నబి



జమ్మలమడుగులో జామియా మసీదు పీఠాధిపతి షాదిక్‌పాషా ఖాద్రి ఆధ్వర్యంలో శుక్రవారం మిలాద్-ఉన్-నబి సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. పీఠాధిపతి మాట్లాడుతూ సమాజంలో తప్పు జరగకుండా మంచి మార్గంలో నడవాలని కోరారు. సఖ్యత భావంతో ఎలాంటి గొడవలు లేకుండా మెలగాలన్నారు. అనంతరం రాత్రి మసీదు వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

రాష్ట్ర స్థాయి పురస్కారాలు

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా శుక్రవారం విజయవాడలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవంలో జిల్లాకు చెందిన పలువురు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్నారు.



అవార్డు అందుకుంటున్న రియాజున్నీసా



షేక్ జవహర్ మునీర్



బి.పరిమళ జ్యోతి



ఆకొనరాయన



ఎంవీ సురేశ్‌బాబు



ఎఫ్‌ఎంఎస్ ఖాదర్

గురువుల చేతుల్లో దేశ భవిష్యత్తు

- కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి
- ఘనంగా గురుపూజోత్సవ వేడుకలు
- 64 మంది జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): దేశ భవిష్యత్తును, సమాజాన్ని మార్చగలిగేది ఒక్క ఉపాధ్యాయులేనని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సభాభవన్‌లో డాక్టర్ సర్వేపల్లె రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో గురుపూజోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్‌తో పాటు ఎస్పీ అశోక్‌కుమార్, ఎమ్మెల్సీలు రామచంద్రారెడ్డి, రామగోపాల్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తన జీవితాన్ని తీర్చిదిద్దడంలో ముఖ్యపాత్ర పోషించిన గురువులకు కృతజ్ఞతలు తెలిపారు. దేశం భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు ముఖ్య భూమిక పోషిస్తారన్నారు. ప్రపంచంలోనే అత్యంత ఉత్తమ విద్యావిధానం ఫిన్‌ల్యాండ్ దేశంలో ఉందని.. అదే విధానాన్ని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చొరవతో రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో తీసుకు వచ్చామన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు విద్యతో పాటు లీడర్‌షిప్ క్వాలిటీస్ నేర్పించాలన్నారు. ఒక ఉపాధ్యాయుడు విధి నిర్వహణలో పొరపాటు చేస్తే దాని ప్రభావం మొత్తం సమాజంపై ఉంటుందన్నారు. విద్యార్థులను మంచి దారిలో నడిపించే బాధ్యత ఉపాధ్యాయుల చేతిలోనే ఉందని స్పష్టం చేశారు.

ఎస్పీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ తన 17ఏళ్ల సర్వీసులో రెండేళ్లు ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేసిన రోజులు మరచిపోలేనన్నారు. విద్యార్థులు మంచి స్థానాలకు చేరుకునే విధంగా ఉపాధ్యాయులు తోడ్పాటు అందించాలని కోరారు. ఎమ్మెల్సీలు మాట్లాడుతూ జన్మనిచ్చిన తర్వాత పిల్లల క్రమశిక్షణ, ఎదుగుదల అభివృద్ధి వంటి బాధ్యతలు గురువులు తీసుకుంటారన్నారు. అనాదిగా గురువు పాత్ర గొప్పదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి వేలకోట్లు ఖర్చు చేస్తోందన్నారు. అందుకు అనుగుణంగా ఉపాధ్యాయులు కృషిచేసి ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందించి నో వేకెన్సీ బోర్డులు పెట్టేస్థాయికి ఎదిగేలా పనిచేయాలని సూచించారు. ఉపాధ్యాయుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామన్నారు.





కలెక్టరేట్‌లో నిర్వహించిన గురుపూజోత్సవ వేడుకల్లో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, చిత్రంలో ఎస్పీ అశోక్‌కుమార్, డీఈవో షంషుద్దీన్, ఎమ్మెల్సీలు రామగోపాల్‌రెడ్డి, రామచంద్రారెడ్డి

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో భాగంగా జిల్లా విద్యాశాఖ 65 మంది జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసింది. ఈ వేడుకలకు ఒక ఎస్జీటీ హాజరు కాలేదు. మిగతా 64 మందిని శాలువా, జ్ఞాపిక, ప్రశంసాపత్రాలతో సత్కరించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ప్రధానంగా ముద్ర అకాడమీ బృందం ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ శామ్యుల్, జిల్లా విద్యాశాఖాధికారి షంషుద్దీన్, సర్వశిక్ష అభియాన్ నిత్యానందరాజు, జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి హజరత్తయ్య, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు దితరులు పాల్గొన్నారు.



విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన


కస్తూర్బా విద్యార్థినికి పాముకాటు

రాయచోటి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని వైష్ణవి

6



అమ్మవారిపేట చెరువు కట్టకు గండి



బి.కోడూరు మండలం అమ్మవారిపేట చెరువు కట్టకు ఏర్పడిన రంధ్రం

బి.కోడూరు/కాశినాయన, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): బి.కోడూరు మండల పరిధిలోని అమ్మవారిపేట చెరువు కట్టకు గండి పడింది. ఈ చెరువుకు లోయర్ సగిలేరు ప్రాజెక్టు నుంచి నీళ్లు వస్తున్నాయి. ఈ చెరువు నుంచే బద్వేలు పెద్దచెరువుకు నీళ్లు వెళ్లాలి. అయితే అమ్మవారిపేట చెరువు కట్ట రాజుపాలెం ఎస్సీ కాలనీ సమీపాన గుంతపల్లె చె రువుకు వెళ్లే తూము వద్ద ఉన్నట్లుండి కృంగి గండిపడింది. చెరువు కట్ట తెగితే రాజుపాలెం ఎస్సీ కాలనీతో పాటు చెరువుకింద ఉన్న పొలాలు కోతకు గురవుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. వెంటనే అధికారులు స్పందించి చెరువుకట్ట గండిని పూడ్చాలని రైతులు కోరుతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

కాశినాయన మండలంలోని రెడ్డికొట్టాల చెరువుకు గత సంవత్సరం గండిపడి నీరు వృథాగా పోతుంటే గ్రామస్థులు ఇసుక బస్తాలు అడ్డుపెట్టి ట్రాక్టర్లతో మట్టి తోలి గండిని పూడ్చారు. ప్రస్తుతం చెరువుకు నీరు చేరింది. గత సంవత్సరం గండిపడిన చోటే మళ్లీ నీరు వృథాగా పోతోంది. ఈ చెరువు కింద దాదాపు 350 ఎకరాల ఆయకట్టు ఉంది. ఇప్పుడు చెరువులో నీరు ఉంటుందా పోతుందా? అనే విషయం అర్థంకాక రైతులు వరినార్లు పోయాలా వద్దా? అనే సందిగ్ధంలో పడ్డారు. అధికారులు స్పందించి గండి పడకుండా చూడాలని లేదంటే వందల ఎకరాల ఆయకట్టు బీడు భూములుగా మారుతాయని రైతులు వాపోతున్నారు.



కాశినాయన మండలం రెడ్డికొట్టాల చెరువుకట్ట వద్ద నీటి లీకేజీని పరిశీలిస్తున్న గ్రామస్థులు

పెన్నానదిలో గాలింపు చర్యలు చేపట్టిన జాలర్లు



వృద్ధ దంపతుల ఆత్మహత్య

- చెన్నూరులో విషాదం



ఆత్మహత్యకు పాల్పడ్డ వెంకటసుబ్బయ్య నాంచారమ్మ (ఫైల్‌ఫొటో)

చెన్నూరు/సిద్దవటం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఒకరినొకరు వదలలేని ప్రేమానురాగాలు.. ఎక్కడికి వెళ్లినా కలిసి వెళ్లడం. 62 ఏళ్ల అన్యోన్య దాంపత్యం. అలాంటి దంపతులను వృద్ధాప్య సమస్యలు వెంటాడాయి. ఇలాంటి సమస్యలతో నిత్యం బాధపడుతూ బిడ్డలకు భారం కాకూడదని నిశ్చయించుకున్నారు. చివరికి తమ ఊరికి దూరంగా వెళ్లి పెన్నానదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ విషాద ఘటనకు సంబంధించి వివరాలిలా..


చెన్నూరులోని పడమటివీధిలో నివాసం ఉంటున్న ఆవుల వెంకటసుబ్బయ్య (84), ఆవుల నాంచారమ్మ(82)లకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె. అందరికీ వివాహాలయ్యాయి. ముగ్గురూ వేర్వేరు ఊర్లలో ఉంటూ జీవనం సాగిస్తున్నారు. వెంకటసుబ్బయ్య ఆరోగ్యంగా ఉన్నంత వరకు దినసరి కూలీగా వ్యవసాయ పొలాల్లో పనిచేసేవాడు. కొంతకాలంగా ఆ దంపతులకు వృద్ధాప్య సమస్యలు ఎక్కువయ్యాయి. అనారోగ్య సమస్యలు తరచూ వెంటాడుతుండడంతో బిడ్డలను వైద్యానికి డబ్బులు అడగడం, వారిని ఇబ్బంది పెట్టడం ఎందుకనుకున్నారు. జీవితం చాలిస్తే ఎవరికీ భారం ఉండదనుకున్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 3వ తేదీ బుధవారం ఉదయం 11గంటలకు ఎవరికీ చెప్పకుండా ఇంట్లోనుంచి ఇద్దరూ వెళ్లిపోయారు. తమ మరణానంతరం అవసరమైన ఖర్చులకు బిడ్డలు ఇబ్బంది పడకూడదని.. బ్యాంకులో పొదుపు చేసుకున్న డబ్బులను, భార్య ముక్కు చెవుల్లోని వస్తువులు తీసి ఇంట్లోనే పెట్టారు. తల్లిదండ్రులు కనిపించకపోవడంతో ఆ కుటుంబ సభ్యులు ఆ రోజంతా వెదికి చివరకు గురువారం చెన్నూరు పోలీస్‌స్టేషన్‌లో కుమారుడు మహేశ్ ఫిర్యాదు చేశారు. వృద్ధ దంపతుల ఆచూకీ కోసం చెన్నూరు సీఐ క్రిష్ణారెడ్డి విచారణ చేపట్టారు.

మాచుపల్లె వద్ద పెన్నానదిలో..

వృద్ధ దంపతులు ఇద్దరూ సిద్దవటం మండలం మాచుపల్లెలోని రేణుక యల్లమాంబ ఆలయం వద్ద గురువారం రాత్రి సుమారు 7గంటల వరకు ఉన్నారు. అమ్మవారిని దర్శించుకుని కాసేపు అక్కడే విశ్రాంతి తీసున్నారు. తర్వాత నాంచారమ్మ పెన్నానదిలోకి దిగారు. కాసేపు అటు ఇటు తిరుగుతూ తడబడి చివరకు వెంకటసుబ్బయ్య కూడా పెన్నాలో దిగాడు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో వీరిద్దరూ మునిగిపోయారు. ఆలయంలో ఉన్న సీసీ కెమెరాలలో ఈ వివరాలు నమోదయ్యాయి. పెన్నా ఒడ్డున నాంచారమ్మ పాదరక్షలు ఉండడంతో బంధువులు గుర్తించారు. వీరి కుమారుడు రాంబాబు ఫిర్యాదు మేరకు సిద్దవటం పోలీసులు శుక్రవారం ఐదుగురు జాలర్ల సహాయంతో పెన్నాలో గాలింపు చర్యలు చేపట్టగా మాచుపల్లి సమీప ప్రాంతాల్లోని ముళ్ల పొదల్లో మృతదేహాలను గుర్తించి ఒడ్డుకు చేర్చారు. సిద్దవటం ఎస్‌ఐ మహమ్మద్‌రఫీ ఆధ్వర్యంలో శుక్రవారం మాచుపల్లె పెన్నా నది ఒడ్డునే రిమ్స్ వైద్యులు పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాలను బంధువులకు అప్పగించారు. దీంతో వారి స్వగ్రామమైన చెన్నూరుకు తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐలు నాయక్, బాబయ్య, హెడ్‌కానిస్టేబుల్ నాయక్, స్థానిక పోలీసు శివప్రసాద్ పాల్గొన్నారు.

ఎంత కష్టమొచ్చిందో వారికి..

ఆరోగ్యం సహకరించకపోయినా ఆ దంపతులు ఇద్దరూ ఆ ప్రాంతంలో అందరితోనూ కలుపుగోలుగా ఉండేవారు. ఎప్పుడూ సంతోషంగా మాట్లాడుతూ గడిపేవారు. అలాంటి వ్యక్తులు ఆత్మహత్యకు పాల్పడడంతో చెన్నూరువాసులంతా ఎంత కష్టమొచ్చిందో ఈ వయసులో వారికి.. ఇలా నదిలో దిగి ఆత్మహత్యకు పాల్పడ్డారంటూ ఆవేదన వ్యక్తం చేశారు.



వెంకటసుబ్బయ్య మృతదేహాన్ని బయటికి తీసుకువస్తున్న పోలీసులు, గజఈతగాళ్లు

చోటా నేత.. బడా మేత..!

- భూ ఆక్రమణలు.. గ్రావెల్ తవ్వకాల్లో గ్రామ నేత కీలకపాత్ర



మదిరేపల్లికి ఎదురుగా గుట్టల్లో మట్టితవ్వకంతో ఏర్పడిన గుంత (ఫైల్‌ఫొటో)

దువ్వూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): భూ ఆక్రమణలు, మట్టి మాఫియా, అడ్డదారుల్లో ముడుపులు దండుకోవడం లాంటి పనులకు దూరంగా ఉండాలని కూటమి ప్రభుత్వం పదే పదే హెచ్చరిస్తున్నా.. కొందరు కిందిస్థాయి నాయకులు ఇదే పనులు కొనసాగిస్తున్నారు. దువ్వూరు మండలంలో బరితెగించిన ఓ చోటా నేత.. అడ్డగోలుగా పెద్దఎత్తున అక్రమార్జనకు పాల్పడుతున్నాడు. దువ్వూరు మండల పరిధిలోని మదిరేపల్లెకు చెందిన అధికార పార్టీ నాయకుడు ఇదినా అడ్డా.. నేను చెప్పిందే జరగాలి అనేలా వ్యవహరిస్తున్నాడు. ఇతడిని ఎవరైనా ప్రశ్నిస్తే నియోజకవర్గ నేతకు చాడీలు చెప్పి ప్రశ్నించిన వారిపై బెదిరింపులకు దిగుతున్నాడు.

గుట్టను ఆక్రమించి..

మదిరేపల్లి సమీపంలో సర్వే నంబరు 327లోని గుట్టల్లో ఇతని అనుచరులు, బంధువులు చదును చేసి సాగు భూములుగా తయారు చేస్తున్నారు. ఈ వ్యవహారంలో ఈయన కీలకపాత్ర పోషిస్తున్నాడు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అయిదారు నెలల్లోనే ఈ ఆక్రమణల పరంపర మొదలు పెట్టాడు. రాత్రివేళల్లో ఎక్స్‌కవేటర్లు, డోజర్లు పెట్టి ఈ తతంగం కొనసాగించాడు. అక్కడ ఏకంగా బోర్లు వేసి విద్యుత్ లైన్లు లాగే పనులు మొదలయ్యాయి.

మట్టి తవ్వుకోవాలంటే..

మైదుకూరు ప్రాంతంలో హైవే పనులు చేస్తున్న ఒక ప్రధాన కంపెనీకి మట్టి అవసరమై దువ్వూరు చెరువు నుంచి తరలిస్తుండగా.. ఇందులోనూ ఆయన జోక్యం చేసుకున్నాడు. ఈ వ్యవహారంలో రూ.10లక్షలు వసూలు చేశాడని ప్రచారం సాగుతోంది. ఇటీవల ప్రొద్దుటూరు ప్రాంతంలో పొలాలమీదుగా జరుగుతున్న రోడ్ల నిర్మాణానికి గ్రావెల్ తరలిస్తున్న వ్యవహారంలో ఈయన కీలకంగా మారాడు. ఇతని అడ్డగోలు వ్యవహారాలకు ఫుల్‌స్టాప్ పెట్టాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

చదును చేస్తున్నది వాస్తవమే..

మదిరేపల్లికి ఎగువ భాగాన సర్వే నంబరు 327లో గుట్టలు కొంత చదును చేస్తున్న మాట వాస్తవమే. వాటిని నిలుపుదల చేశాం. తిరిగి ఇలాంటి పనులు చేస్తుంటే చర్యలు తీసుకుంటాం. గ్రావెల్ అవసరమైతే అనుమతులు తీసుకొని తరలించాలి. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటాం.

- సంజీవరెడ్డి, తహశీల్దార్, దువ్వూరు



గ్రావెల్‌ను టిప్పర్‌లో నింపుతున్న ఎక్స్‌కవేటర్



సర్వే నంబరు 326లోని గుట్టను ఆక్రమించి తయారు చేసిన పొలం

పూర్వ విద్యార్థుల చేయూత

● రూ.2.50 లక్షలతో కళావేదిక నిర్మాణం, రాధాకృష్ణన్ విగ్రహం వితరణ



రాధాకృష్ణన్ విగ్రహం వద్ద పూర్వ విద్యార్థులు

ములకలచెరువు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని బురకాయలకోట జడ్పీ హైస్కూల్‌కు పూర్వ విద్యార్థులు చేయూతనిచ్చారు. పాఠశాలలో 1986-87లో పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు రూ.2.50 లక్షలతో కళావేదిక (స్టేజీ) నిర్మించడంతో పాటు డాక్టర్ సర్వేపల్లె రాధాకృష్ణన్ విగ్రహాన్ని వితరణ చేశారు. గురుపూజోత్సవం సందర్భంగా శుక్రవారం పూర్వ విద్యార్థులు నిర్మించిన కళావేదికలో సర్వేపల్లె రాధాకృష్ణన్ విగ్రహం ఏర్పాటు చేశారు. ఇక్కడే గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అలాగే తమకు చదువు చెప్పిన గురువు రామకృష్ణమరాజుతో పాటు ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న టీచర్లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో పూర్వ విద్యార్థులు గుత్తికొండ త్యాగరాజు, సీవీ రెడ్డి, మంగరాజు, బాబు, లక్ష్మన్న, మద్దిరెడ్డి, రెడ్డెప్పరెడ్డి, వీవీ రమణ, మిలటరీ నరసింహులు, రామచంద్ర, సంధ్యారాణి, సునంద, రెడ్డెమ్మ, ప్రమీల, లీలావతి తదితరులు పాల్గొన్నారు.

కారుకు నిప్పు - కేసు నమోదు



కాలిపోయిన మారుతీకారు

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇంటి సమీపంలో నిలిపి ఉంచిన తన మారుతీకారుకు శుక్రవారం తెల్లవారు జామున గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టినట్లు స్థానిక పాత మసీదు ప్రాంతా నికి చెందిన అన్వర్‌బాషా తెలిపారు. కొన్నేళ్లుగా తన ఇంటి సమీపం లోని చెట్టు కింద కారు పెడుతున్నామని, శుక్రవారం తెల్లవారు జామున కారు టైరు పగిలిన శబ్దం రావడంతో బయటకు వచ్చి చూసేసరికి కారు మంటల్లో కాలుతూ కనిపించిందన్నారు. పోలీసు లకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ రవీంద్రబాబు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు బాధితుడు అన్వర్‌బాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న బొలెరో

● రైతుకు తీవ్రగాయాలు



తీవ్రంగా గాయపడ్డ శివారెడ్డి

ములకలచెరువు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ముంబై-చెన్నై జాతీయ రహదారిలోని వేపూరికోట పెట్రోల్ బంకు వద్ద శుక్రవారం బొలెరో వాహనం ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో రాజుగారిపల్లెకు చెందిన రైతు శివారెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు... మండలంలోని దేవళచెరువు పంచాయతీ రాజుగారిపల్లెకు చెందిన రైతు శివారెడ్డి(45) పనుల నిమిత్తం ద్విచక్రవాహనంలో వేపూరికోటకు వచ్చాడు. ఈ క్రమంలో పెట్రోల్ బంకులో పెట్రోల్ పట్టుకునేందుకు వెళ్తుండగా బొలేరో వాహనం ఢీకొంది. దీంతో రైతు తీవ్రంగా గాయపడడంతో చికిత్స నిమిత్తం 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

వినాయక నిమజ్జనం అడ్డగింత



విలేకరుల ఎదుట ఆవేదన వ్యక్తం చేస్తున్న దళితులు

నందలూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొత్తపి గ్రామంలో దళితులు నిర్వహిస్తున్న వినాయకుడి నిమజ్జనాన్ని అగ్రవర్ణాలవారు అడ్డుకున్నారు. దళితుల కథనం మేరకు.. గురువారం రాత్రి పొత్తపి హరిజనవాడకు చెందిన దళితులు వినాయకుడిని నిమజ్జనం చేసేందుకు ఊరేగింపుగా వెళుతుండగా, అగ్రవర్ణాల వారు రాళ్లు, కట్టెలతో దాడికి ప్రయత్నించగా, అక్కడి నుంచి పారిపోయి పోలీసులను ఆశ్రయించారు. తమపై దాడికి యత్నించిన ఐదుగురిపై చర్యలు తీసుకోవాలని దళితులు కోరారు.

జూదరుల అరెస్ట్

రాజంపేటటౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని భవానినగర్ సమీపంలో పేకాట ఆడుతున్న 11 మందిని శుక్రవారం అదుపులోకి తీసుకొని, రూ.15 వేలు నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ నాగార్జున తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవానినగర్‌లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో ఎస్ఐ వెంకటేష్, సిబ్బంది దాడి చేశారని తెలిపారు.

రేపు జమ్మలమడుగులో జిల్లా బాల్ బ్యాడ్మింటన్ జూనియర్ జట్లు ఎంపిక

రాజంపేట, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కడప జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 7న ఆదివారం జమ్మలమడుగు మండలం ఎస్.ఉప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉమ్మడి కడప జిల్లా జూనియర్ బాల బాలికల జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.కృష్ణమూర్తి, జి.వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఎంపికలకు ఫిబ్రవరి 1, 2006 తర్వాత జన్మించినవారు అర్హులని తెలియజేశారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 12, 13, 14 తేదీల్లో అనంతపురం జిల్లా బత్తలపల్లి మండలం రామాపురంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. క్రీడాకారులు సెలక్షన్‌కు వచ్చేటప్పుడు పుట్టిన తేదీ గల ఆధార్‌కార్డు, స్టడీ సర్టిఫికెట్స్, పదో తరగతి మార్కుల జాబితా, 8 ఫొటోలు, డ్రెస్‌కోడ్, షూ, తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. వివరాలకు 9490181104, 7036907303 నంబర్లలో సంప్రదించాలన్నారు. ఈ పోటీల్లో పాల్గొనేవారికి గ్రామ పెద్ద శ్రీనివాసులరెడ్డి ఉచిత భోజనం ఏర్పాటు చేయనున్నారని వివరించారు.

వ్యర్థాల సేకరణకు స్వచ్ఛరథం

- ఈ నెల 15 నుంచి పీలేరులో ప్రారంభం
- ప్లాస్టిక్ వస్తువులు, అట్టపెట్టెలు తీసుకొని నిత్యావసరాల పంపిణీ
- ప్లాస్టిక్ రహిత గ్రామాలే లక్ష్యం
- పంచాయతీలపై అదనపు భారం ఉండదు
- గుంటూరు జిల్లా లాలాపురం పైలెట్ ప్రాజెక్ట్ సక్సెస్
- డీపీఓ రాధమ్మ





పీలేరు మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయం, (ఇన్‌సెట్లో) స్వచ్ఛరథంలో ఇవ్వనున్న నిత్యావసర సరుకులు

పీలేరురూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గ్రామాలను ప్లాస్టిక్ వ్యర్థాల రహితంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా స్వచ్ఛ రథం పేరుతో ఏర్పాటు చేసిన వాహనాల ద్వారా ప్లాస్టిక్ వస్తువులు సహా ఐరన్, అట్ట పెట్టెలు, ఇతర పనికి



వ్యర్థాల సేకరణకు ఉపయోగించే స్వచ్ఛరథం

రాని వస్తువులు తీసుకొని దానికి బదులుగా నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తోంది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛ రథాలను గుంటూరు జిల్లా లాలూపురంలో ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేశారు. ఇక్కడ ఈ పథకం సక్సెస్ కావడంతో అన్నమయ్య జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా పీలేరు మేజర్ గ్రామ పంచాయతీలో ఈ నెల 15 నుంచి స్వచ్ఛరథం ప్రారంభించనున్నారు. వీటి ద్వారా వాటర్ బాటిళ్లు, పాలిథీన్ సంచులు, పాడైన ప్లాస్టిక్ వస్తువులు, ఇలా ఇంట్లో పనికిరాని వాటిని బహిరంగ ప్రదేశాల్లో పడేయకుండా స్వచ్ఛ రథం ద్వారా సేకరించనున్నారు. వ్యర్థాలు తీసుకుని ఇచ్చే నిత్యావసరాల్లో పప్పు, ఉప్పు, చింతపండు, సబ్బులు వంటివి ఉన్నాయి.

కూటమి ప్రభుత్వం వినూత్న ఆలోచనతో తడి పొడి చెత్తతో పాటు నిరుపయోగమైన ప్లాస్టిక్ తదితర వేస్ట్ సేకరణ కోసం ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేశారు. వైసీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ (ఎండీయూ) లను రద్దు చేసింది. ఇందుకోసం గతంలో ఉపయోగించిన వాహనాల ఆపరేటర్లకు ఉపాధి కల్పించడంతో పాటు ప్లాస్టిక్ తదితర వ్యర్థాలను సేకరించేందుకు వాటిని వినియోగిస్తారు. నెలకు ఒక్కో వాహనానికి రూ.21 వేల నుంచి రూ.25 వేలు ఇవ్వనున్నారు. ప్రజల నుంచి సేకరించిన ప్లాస్టిక్ వ్యర్థాలను బయటి మార్కెట్‌లో విక్రయించి వాటికి సరిపడా నిత్యావసర సరుకులు తెచ్చుకునే బాధ్యత ఎండీయూ ఆపరేటర్లకు అప్పగించారు.

చెత్త తీసుకొని ఇచ్చేవి...

'స్వచ్ఛ రథం' వద్ద పాత ఇనుము, పేపర్లు, పుస్తకాలు, అట్టపెట్టెలు, ప్లాస్టిక్, గాజుసీసాలు, స్టీల్, అల్యూమినియం తదితర పాడైన వస్తువులు తీసుకొంటారు. వీటికి విలువ కట్టి నిత్యావసరాలైన కొబ్బరి నూనె, సర్ఫ్ ప్యాకెట్లు, ఉల్లిపాయలు, బట్టల సబ్బులు, ఒంటి సబ్బులు, టీ, కాఫీ, పౌడర్లు, లేస్ పాకెట్లు, పేస్ట్, షాంపూ ప్యాకెట్లు, ఉల్లిపాయలు, టూత్ బ్రష్‌లు, పెన్నులు, పెన్సిళ్లు, గోధుమ పిండి, వేరుశనగ గుళ్లు, మినపగుళ్లు, కందిపప్పు తదితర నిత్యావసరాలు ఇస్తారు. కేజీ ప్లాస్టిక్‌కు రూ.20 చొప్పున నిత్యావసర సరుకులు ఇస్తారు.

పంచాయతీపై ఆర్థిక భారం ఉండదు

- రాధమ్మ, డీపీఓ



స్వచ్ఛ రథం పథకాన్ని పీలేరులో ఆగస్టులో ప్రారంభించాలని అనుకున్నాం. అయితే కొంత ఆలస్యమైంది. ఈ నెల 15 నుంచి పీలేరులో స్వచ్ఛరథం ప్రారంభిస్తాం. దీనివల్ల పంచాయతీపై ఎటువంటి అదనపు భారం పడదు. కేవలం వాహనం మెయింటనెన్స్, ఆపరేటర్‌కు నెల జీతం రూ.21 వేలు ఇవ్వడం జరుగుతుంది. గుంటూరు జిల్లాలో పైలెట్ ప్రాజెక్ట్ విజయవంతమైంది. అన్నమయ్యలో పీలేరు మేజర్ పంచాయతీని ఎంపిక చేశాం. అనంతరం దశలు వారిగా ఇతర మండలాలకు విస్తరింపజేస్తాం. ఇళ్లలో నిరుపయోగమైన వ్యర్థాలను ఇచ్చి నిత్యావసర సరుకులు తీసుకోవడం వల్ల ప్రజలకు ఎంతో ఉపయోగం.

ముగిసిన వెంకన్న పవిత్రోత్సవాలు

● వైభవంగా పూర్ణాహుతి

తంబళ్లపల్లె, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోసువారిపల్లెలో కొలువైన ప్రసన్న వేంకటరమణస్వామి ఆలయంలో గత నాలుగు రోజులుగా టీటీడీ ఆధ్వర్యంలో జరుగుతున్న వార్షిక పవిత్రోత్సవాలు మహాపూర్ణాహుతితో వైభవంగా ముగిశాయి. శుక్రవారం తెల్లవారుజామున వేదపండితులు శ్రీవారిని సుప్రభాతంతో మేల్కొలిపి దూపదీప నైవేద్యాలతో సహస్రనామార్చన, నిత్యకైంకర్యాలు పూర్తి చేశారు. యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం చతుస్థానార్చన, మహా పూర్ణాహుతి, కుంభప్రోక్షణ, పవిత్ర విసర్జన పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత స్వామి వారి ఉత్సవమూర్తులకు పాలు, పెరుగు, తేనే, చందనం, నెయ్యి, పసుపు, కొబ్బరినీళ్లతో వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తులను పల్లకిపై కొలువుదీర్చి ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవోలు వరలక్ష్మీ, ఆలయ ఇన్‌స్పెక్టర్ దిశంత్‌కుమార్, ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణప్రసాద్ భట్టర్, ఉప ప్రధాన అర్చకులు రమేష్ స్వామి, సిబ్బంది నగేష్ తదితరులు పాల్గొన్నారు.



స్వామివారిని ఊరేగింపుగా తీసుకువెళ్తున్న టీటీడీ అధికారులు, వేదపండితులు

వైసీపీ నాయకుల భూ దందాపై సీఎంకు వినతి



సీఎంను కలిసి వివరిస్తున్న పుల్లంపేట టీడీపీ నాయకులు

పుల్లంపేట, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వందలాది ఎకరాల ప్రభుత్వ భూములను వైసీపీ నాయకులు ఆక్రమించారని, దీనిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి ఆధ్వర్యంలో రైల్వేకోడూరు మార్కెట్‌కమిటీ మాజీ చైర్మన్ నేలపాటి రామచంద్ర నాయుడు, మండల మాజీ ఇన్‌చార్జి పోలూరు కృష్ణమనాయుడు, మండల యూత్ నాయకులు ముద్దా సుభాష్‌రెడ్డి శుక్రవారం అమరావతిలో ముఖ్యమంత్రిని కలిసి ఫిర్యాదు చేశారు. మండలంలోని అనంతసముద్రం, వత్తలూరు, తిప్పాయపల్లె ప్రాంతాల్లో వందలాది ఎకరాల ప్రభుత్వ భూముల కబ్జా చేయడంతోపాటు, కొందరి నుంచి బలవంతంగా లాక్కొని అమ్మివేశారని సర్వేనంబర్లతో సహా ముఖ్యమంత్రికి వివరించారు. మండలానికి పెద్దఎత్తున నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని విన్నవించుకున్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గ అభివృద్ధి పనులపై ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి సీఎంకు వివరించారు.

పెట్రోల్ పోసి నిప్పుపెట్టిన కేసులో..

ఆరుగురు నిందితులు అరెస్టు

● రిమాండ్‌కు తరలింపు

మదనపల్లెఅర్బన్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): పెట్రోల్ పోసి నిప్పు పెట్టిన కేసులో ఆరుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మదనపల్లె డీఎస్పీ మహేంద్ర తెలిపారు. ఈ నెల 3వ తేదీన మదనపల్లె పట్టణం, బీకేపల్లెలోని వైఎస్సార్ కాలనీలో ఓ వ్యక్తిపై పెట్రోల్ పోసి నిప్పుపెట్టిన కేసులో ఆరుగురిని గుర్తుంచి అరెస్టు చేసినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక టూటౌన్ పోలీసుస్టేషన్‌లో మిడియాతో డీఎస్పీ మాట్లాడుతూ అన్నదమ్ముల ఆస్తి వివాదాల నేపథ్యంలో సలీంబాషా ఇంటిపై రాయచోటి వాసులు దాడి యత్నాన్ని అడుకున్న రమేష్ నాయక్‌పై పెట్రోల్ పోసి నిప్పు అంటించి చంపడానికి ప్రయత్నించిన కేసులో నిందితులు రాయచోటికి చెందిన ఖాసీం సాహెబ్ కుమారులు షేక్ జావీద్ హుసేన్, షేక్ సామీర్ హుసేన్, జీలాని బాషా కుమారుడు షేక్ ఇలాహి అలియాజ్ పాజిల్, కలికిరి మండలం వాసి అబ్దుల్ మజీద్ కుమారుడు వేంపల్లె మస్తాన్, కేవిపల్లె మండలం, తిమ్మాపురం గ్రామం, కొత్తఇండ్లుకు చెందిన ఇమాంసాహెబ్ కుమారుడు షేక్ అమీర్



నిందితుల అరెస్టు చూపుతున్న డీఎస్పీ మహేంద్ర

సాహెబ్, కలి కిరి మండలం, గుండ్లూరుకు చెందిన సుధాకర్ కుమారుడు విశ్వనాథ్‌బాబు ఉన్నారన్నారు. వైఎస్సార్ కాలనీలో ఉన్న షేక్ సలీంబాష తండ్రి షేక్ మహబూబ్ బాషా, అతని అన్న రాయచోటికి చెందిన ఖాసీం సాహెబ్ ఆస్తి విషయమై మనస్పర్థలు ఉండేవని, ఏడాది కిందట షేక్ మహబూబ్‌బాషా మృతి చెందాడని, ఇరు కుటుంబాల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఆగస్టు 15వ తేదీన కూడా మదనపల్లెకు వచ్చి ఘర్షణ పడ్డారని చెప్పారు. ఈ క్రమంలో ఈ నెల 3 వతేదీ ఫోన్‌లో గొడపడ్డారని వెంటనే పథకం ప్రకారం రాయచోటి నుంచి కారులో వచ్చి మార్గమధ్యలో బాటిల్‌లో పెట్రోలు తీసుకొచ్చా రని వివరించారు. 3 వతేదీ తెల్లవారుజామున 4 గంటలకు బీకేపల్లె చేరుకుని సలీంబాషా నివాసం ఉన్న పైగది వెళ్ల దానికి అక్కడ గేట్‌ను, షట్టర్‌ను పగలకొట్టడానికి ప్రయత్నం చేస్తుండగా శబ్దం రావడంతో సలీం బాషా ఇంట్లో బాడుగకు ఉంటున్న రమేష్‌నాయక్ చూసి అడ్డుకోవడంతో అతనిపై పెట్రోల్ పోసి నిప్పుపెట్టారు. గమనించిన మరో వ్యక్తి బైక్‌పై రావడంతో ఆ బైక్‌ను కూడా ధ్వంసం చేశారని చెప్పారు. ఈ మేరకు వారిపై హత్యాయత్నం, ఎస్సీఎస్సీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. ప్రస్తుతం గాయపడిన రమేశ్‌నాయక్ బెంగళూరులో చికిత్స పొందుతున్నాడు. రాబడిన సమాచారం మేరకు వారిని మదనపల్లె పట్టణం, రామారావు కాలనీ, ఆటోస్టాండ్ వద్ద శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో అరెస్టు చేసినట్లు చెప్పారు.

యునాని వైద్య కళాశాలకు స్థలం కేటాయింపుపై హర్షం

రాయచోటిటౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో యునాని వైద్య కళాశాల కోసం రాష్ట్ర ప్రభుత్వం 10 ఎకరాలు స్థలం కేటాయించడంపై అన్నమయ్య జిల్లా రియాసతి ఉర్దూ ఉపాధ్యాయ సంఘం హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా జరిగిన నిర్వహించిన సమావేశంలో ఆ సంఘం అధ్యక్షుడు సిబాతుర్ రెహమాన్ మాట్లాడుతూ ఉర్దూ విద్యార్థులు ఎక్కువగా ఉన్న రాయచోటి ప్రాంతంలో యునాని వైద్య కళాశాల ఏర్పాటుతో చాలా మంది వైద్య విద్యను అభ్యసించడానికి అవకాశం ఉంటుందన్నారు. సంఘం రాష్ట్ర కోశాదికారి అసదుల్లాషా మాట్లాడుతూ గత శతాబ్దకాలంగా రాయచోటిలోని డైట్ కళాశాల వేల మంది ఉర్దూ ఉపాధ్యాయులను అందించిందని, యునాని కళాశాల వస్తే ఎంతో మంది యునాని వైద్యులు సిద్ధమవుతారన్నారు. అనంతరం ఉపాధ్యాయులు మహమ్మద్‌అలీ, ఇలియాస్ మాట్లాడుతూ ఈ కళాశాల మంజూరుకు సహకరించిన మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు. రూటా రాష్ట్ర సభ్యులు మహమ్మద్ అలీ, ఇలియాస్, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ జాఫరుద్దీన్, కోశాధికారి ముహిబుల్లా తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలలను ప్రభుత్వమే నిర్వహించాలి

● బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్

మదనపల్లెఅర్బన్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు తీసుకున్న పీపీపీ మోడల్‌ను వెంటనే విరమించుకోవాలని, మెడికల్ కళాశాలలను ప్రభుత్వమే నిర్వహించాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక బీఎస్పీ కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ - పబ్లిక్ - పార్టనర్‌షిప్ విధానంతో రోడ్లు, వైద్యం, యుటిలిటీ వంటి ప్రజా సేవలు ప్రైవేట్ పరం చేస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేద విద్యార్థులు మెడికల్ కళాశాలల్లో రిజర్వేషన్ కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యశాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు మదనపల్లె ప్రజలు రాజకీయ భిక్ష పెడితే ఆ ప్రజల నోట్లో మట్టి కొడుతున్నారన్నారు. ప్రతిపక్షంలో అనేక ఉద్యమాల్లో పాల్గొన్న విషయాలను ఎమ్మెల్యే షాజహాన్ బాషా గుర్తుపెట్టుకోవాలన్నారు. మదనపల్లె మెడికల్ కళాశాల ప్రైవేట్ పరం చేయాలని చూస్తే ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తన పదవికి రాజీనామా చేసి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. నిన్నటి కేబినెట్‌లో అన్ని మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయాలని ఆమోదించడం దారుణమన్నారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలకు బీఎస్పీ పిలుపునిస్తోందన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ నేతలు సహదేవ, చంద్ర, బాలజీ, మహేష్, ప్రశాంత్, శివ, అనిల్,రెడ్డెప్ప, వేణు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గౌతమ్‌కుమార్

పేదలకు వైద్యం దూరమైనట్లే

మదనపల్లె మెడికల్ కళాశాలను ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట సీపీఎం నిరసన చేపట్టింది. జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ పీపీపీ పద్ధతి రద్దు చేయాలని, ప్రభుత్వ ఆస్పత్రిని ప్రైవేటీకరణ చేయెద్దు అంటూ పెద్దఎత్తున నినాదాలు చేపట్టారు. మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తంబళ్లపల్లె, మదనపల్లె, పుంగనూరు, పీలేరు నియోజకవర్గాల నుంచే కాకుండా కర్ణాటక రాష్ట్రం కోలార్ ప్రాంతాల నుంచి ప్రజలు వచ్చి వైద్య సేవలను పొందుతున్నారన్నారు. మెడికల్ కళాశాల అభివృద్ధి అయితే అన్ని రకాల వైద్య సేవలు ఇక్కడే పొందవచ్చన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో న్యాయవాది సోముశేఖర్, సీపీఎం నేతలు ప్రభాకర్ రెడ్డి, నరసింహ, నాగరాజ, ఆఫ్రీద్, జయబాబు, తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా విద్యార్థినికి పాముకాటు



రాయచోటి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని వైష్ణవి

రాయచోటిటౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సుండుపల్లె రోడ్డులో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల పదో తరగతి విద్యార్థిని పాము కాటుకు గురైంది. మండల పరిధిలోని శిబ్యాల గ్రామ హరిజనవాడకు చెందిన వైష్ణవి శుక్రవారం ఉదయం పాఠశాల ఆవరణలో చదువుకుంటూ ఉండగా కుడికాలి బొటనవేలిపై పాము కాటు వేయడంతో, పాఠశాల సిబ్బంది గుట్టుచప్పుడు కాకుండా ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆ విద్యార్థిని రాయచోటి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఆమె పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని వైద్యులు అంటున్నారు. విషయం తెలుసుకున్న జిల్లా, మండల విద్యాశాఖ అధికారులు ఆసుపత్రికి చేరుకుని సంఘటనపై ఆరా తీశారు. ఇదిలా ఉండగా పాఠశాల చుట్టూ ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు ఏపుగా ఉండడంతోనే విషపురుగులు పాఠశాలలో సంచరిస్తున్నాయని, అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆలిండియా స్టూడెంట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తుమ్మల లవకుమార్ డిమాండ్ చేశారు.

కడప జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులు వీరే..



కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎమ్మెల్సీలు రాంగోపాల్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, ఎస్పీ అశోక్‌కుమార్, డీఈవో షంషుద్దీన్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకుంటున్న ప్రధానోపాధ్యాయురాలు పి.నాగమణి



జె.మేర్సీమాలిని, కేవీ నాగిరెడ్డి, ఎన్.సరస్వతి, ఎం.రామకృష్ణమ్మ, కె.లక్ష్మీకేశమ్మ, శ్రీ దీపారెడ్డి, వి. జనార్దన్, డి. నాగరాజు, కె. నాగార్జున, టి. సావిత్రమ్మ, పీవీ పద్మనాభరెడ్డి

పి. నాగకృష్ణారెడ్డి, ఎస్. నూర్, పి.భార్గవిప్రియదర్శిణి, బి. సుధాకర్‌రెడ్డి, పి.మహాలక్ష్మి, పి. శ్రీదీప, ఎ. ఎరుకలరెడ్డి, వీవీ గాయత్రి, ఎన్ఆర్‌వీ ప్రసాద్‌రెడ్డి, ఎస్.ఫిరోజ్‌జాన్, ఎస్.గురవయ్య, పీఆర్ మంజులాదేవి, ఎస్.ఓబయ్య

ఎ.అరుణకుమారి, కె.రవిశంకర్, బీవీ సుబ్బారెడ్డి, ఎస్.సయ్యద్‌బాషa, ఎస్‌వి చాంద్‌బాష, ఎస్తేర్ సుకుమారి, టి. రామకృష్ణ, జె.సుబ్రమణ్యం, జి.గోపీనాథ్, ఎం.శివప్రసాద్, సుచిత్రకుమారి, కె.కృష్ణయ్య, జి.శివరామకృష్ణంరాజు

బి.శ్రీనివాసులు, ఎస్.ఖాసీంవల్లీ, పి.సుహాసిని, బి.భాస్కర్‌రెడ్డి, ఎస్.రామకృష్ణారెడ్డి, బి.ఆదిశేషారెడ్డి, కె.వెంకటసుబ్బన్న, డి.దస్తగిరి, ఎన్.రాజారావ్, సి.వీరారెడ్డి, ఆర్.గురవయ్య, ఆర్‌వీ సౌభాగ్యలక్ష్మీదేవి, కె.రాధిక

మేరీ సువర్ణ, ఎన్.శ్రీనివాసులు, ఎ.పెంచలయ్య, బి.ప్రభుభూషణ, పి.గాయత్రి, బి.ఈశ్వర్‌రావు, సి.సుదర్శన్, టి.శ్రీనివాసులు, ఐ.రహీంబకాష్, ఎస్.ఫాతిమాసుల్తానా, ఎస్.హబీదున్నీసా బేగం, ఏ.ఫరీదాభాను, వెంకటసుబ్బయ్య

అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని ఫిర్యాదు

పోరుమామిళ్ల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తన భర్త, అత్తమామలు, మరిది అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని వి.సునీత అనే మహిళ స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ ఆర్‌వీ కొండారెడ్డి తెలిపారు. మండలంలోని కొరపాటిపల్లె పంచాయతీ ఇందిరానగర్‌కు చెందిన వీధిపోగు సునీతకు 2020 సంవత్సరం మైదుకూరు మండలం విశ్వనాథపురానికి చెందిన సిరివెళ్ల పవన్‌కళ్యాణ్‌తో వివాహం జరిగింది. వివాహం తరువాత పిల్లలు పుట్టలేదని, కట్నం తీసుకురమ్మని తనను మానసికంగా శారీరకంగా ఇబ్బందులకు గురి చేశారన్నారు. ఈ మేరకు బాధితురాలు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బ్రాందీషాపులో చోరీ

- మద్యం బాటిళ్లు, నగదు అపహరణ



చోరీకి పాల్పడుతున్న వ్యక్తి ఫొటో సీసీ ఫుటేజీలో రికార్డయిన దృశ్యం

ఖాజీపేట సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కడప-కర్నూలు జాతీయ రహదారిలోని కోటంగురాయునిపల్లె వద్ద గల ఎస్ఎల్‌బీ వైన్స్‌లో శుక్రవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. యజమాని నెల్లూరప్ప యాదవ్ వివరాల మేరకు... రోజు దినచర్యలో భాగంగా రాత్రి 10 గంటలకు అన్ని డోర్లు లాక్ చేసి వెళ్లామని, శుక్రవారం ఉదయం అంగడి తెరువగా లోపల వెనుక భాగంలో గల డోరు తెరచి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. క్యాష్ కౌంటర్‌లోగల రూ.10వేలు నగదు, అయిదు కేసుల మందు తీసుకెళ్లినట్లు సీసీ ఫుటేజీలో ఉందన్నారు. ఈ మేరకు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అదుపు తప్పి కాలువలో పడి మహిళ మృతి

మైదుకూరు రూరల్,సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తిప్పిరెడ్డిపల్లె సమీపంలోని తెలుగుగంగ కాలువలో జారిపడి గుండంరాజు లక్ష్మమ్మ (75) అనే మహిళ మృతి చెందారు. సీఐ రమణారెడ్డి వివరాల మేరకు... మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని బండివారిపల్లె గ్రామానికి చెందిన లక్ష్మమ్మ పొలం పనులకు వెళ్లింది. ఆ సమయంలో బహిర్భూమికి వెళ్లి కాలుజారి కాలువలో పడి మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు



కమలాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీరాములు

కమలాపురం రూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గంగవరం గ్రామ సమీపంలోని కాశినాయన దేవాలయం వద్ద ఓ వ్యక్తిని సిమెంటు ట్యాంకర్ ఢీకొన డంతో తీవ్ర గాయాల య్యాయి. స్థానికుల సమాచారం మేరకు.. మైదుకూరు మండలం బదిరేపల్లె గ్రామానికి చెందిన కామనూరు శ్రీరాములు అనే వ్యక్తి గంగవరం గ్రామ సమీపంలో కాశినాయన ఆలయం సమీపంలో అరు గుపై కూర్చుని బంధువులతో మాట్లాడుతున్నాడు. అదే సమయంలో ఖాజీపేట నుంచి కమలాపురం వైపు వస్తున్న సిమెంటు లారీ ప్రమాద వశాత్తు ఢీకొట్టింది. దీంతో శ్రీరాములుకు తీవ్ర గాయాలయ్యాయి. హుటాహుటిన కమలాపురం ప్రభుత్వ ఆసుపత్రికి 108లో తరలించి చికిత్స అందించారు. డ్రైవరు మద్యం మత్తులో ఉండడమే ప్రమాదానికి కారణమని స్థానికులు తెలిపారు.

160 పరుగులతో నెల్లూరు జట్టు ఘన విజయం

- డ్రాగా ముగిసిన కడప- కర్నూలు మ్యాచ్

కడప స్పోర్ట్స్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ సౌత్‌జోన్ అండర్-23 మెన్స్ మల్టీడే (మూడురోజుల) క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా చివరి రోజైన శుక్రవారం వివిధ జట్ల మధ్య పోటీలు రసవత్తరంగా సాగాయి. ఇందులో అనంతపురం జట్టుపై నెల్లూరు జట్టు 160 పరుగులతో విజయం సాధించింది. కడప- కర్నూలు జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్ డ్రాగా ముగిసింది. వివరాలిలా...

కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్స్‌లో 44.4 ఓవర్లలో 239 పరుగులు చేసింది. అనంతపురం జట్టు 43.3 ఓవర్లలో 242 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో అనంతపురం జట్టుకు 3 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. రెండవ ఇన్నింగ్స్‌లో నెల్లూరు జట్టు 60 ఓవర్లలో 350 పరుగులకు ఆలౌట్ అయింది. 347 పరుగుల విజయలక్ష్యంతో రెండో ఇన్నింగ్స్‌కు దిగిన అనంతపురం జట్టు చివరి రోజు 48.1 ఓవర్లలో 187 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో నెల్లూరు జట్టు 160 పరుగుల తేడాతో గెలుపొందింది.

నగర రిమ్స్ సమీప వైయస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో కడప-కర్నూలు జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో కడప జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 88.4 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 374 పరుగులకు డిక్లేర్ చేసింది. తదనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 67.3 ఓవర్లలో 314 పరుగులు చేసింది. దీంతో కడప జట్టుకు 60 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది.

ఆటకు చివరి రోజైన కడప జట్టు రెండో ఇన్నింగ్స్‌కు దిగి 80 ఓవర్లలో 297 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. ఇందులో శివకేశవ 66 పరుగులు, ఆదిల్‌హుస్సేన్ 58 పరుగులు చేశారు. అనంతరం కర్నూలు జట్టు తన రెండో ఇన్నింగ్స్‌కు దిగి ఆట ముగిసే సమయానికి 3 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 40 పరుగులు చేసింది. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది.

గణనాథునికి ఘనంగా కుంకుమార్చన



దేవరగుట్టపల్లెలో గణనాథునికి మహిళలచే కుంకుమార్చన

చక్రాయపేట, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెర్సు పల్లె గ్రామం దేవరగుట్టపల్లెలో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి 500 మంది మహిళలతో కుంకుమార్చన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామ మాజీ సర్పంచు సుబ్బరామయ్య కుమారుడు రాహుల్ ఆధ్వ ర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కుంకుమార్చనలో పాల్గొన్న మహి ళలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

ఇసుక ట్రాక్టరు బోల్తా... డ్రైవరుకు గాయాలు



సంఘటనా స్థలం వద్ద బోల్తాపడిన ట్రాక్టరు

వల్లూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జంగంపల్లె గ్రామ సమీపాన ఇసుక లోడుతో వెళుతున్న ట్రాక్టరు బోల్తా పడటంతో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు.. కడపకు ఇసుక తరలిస్తున్న ట్రాక్టరు అదుపు తప్పి పైడికాల్వ క్రాస్ వద్ద రోడ్డుపై బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టరు డ్రైవరుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి 108 వాహనంకు సమాచారం అందించారు. గాయపడిన డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. ప్రమాదానికి గల కారణాలపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రేపు ఆలయాల మూసివేత

కడప కల్చరల్, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యో తి): సంపూర్ణ చంద్ర గ్రహణం సందర్భంగా ఈనెల 7వ తేదీ ఆదివారం జిల్లాలోని ఆలయాలను మధ్యాహ్నం 3-30 గంటల నుంచి మూసివేయనున్నట్లు జిల్లా ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ జి. మల్లికార్జున ప్రసాద్ తెలిపారు. తిరిగి 8వ తేదీ సోమవారం ఉదయం ఆలయాల శుద్ధి, సంప్రోక్షణ చేసి భక్తులకు దర్శనం కల్పిస్తామన్నారు. భక్తులు ఆ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని సహకరించాలని కోరారు.

ఆలోచన అదిరిందయ్యా.. శీనయ్య !

ఓ రైతు తాను సాగు చేసిన పంటను కాపాడేందుకు వినూత్నంగా ఆలోచించాడు. పాత దువ్వూరుకు శ్రీనివాసులునాయుడు గ్రామ సమీపంలో పసుపు పంట సాగు చేశాడు. పసుపుతోటకు పక్కనే చింతచెట్లు ఉన్నాయి. వాటిపై ఉన్న కోతులు నిత్యం తోటలోకి వచ్చి మొక్కలు పీకివేస్తున్నాయి. ఈ నేపథ్యంలో రైతు శ్రీనివాసులు నాయుడు కోతులతో విసుగుచెందాడు. పంటను కాపాడుకునేందుకు సమీప పొలంలో స్పీకర్ పెట్టాడు. బౌబౌ అంటూ ఒక శబ్దంతో కూడిన స్పీకర్‌ను అమర్చాడు. కుక్క వచ్చి అరచినట్లు, రాళ్లు గలకరించిన శబ్దంతో స్పీకర్ పనిచేయడంతో కోతులు ఆ సమీపంలోకి వచ్చేందుకు భయపడుతున్నాయి. దీంతో రైతు ప్రయత్నం ఫలించింది. ఇది చూసిన తోటి రైతులు అదిరిందయ్యా శీనయ్య అంటూ మెచ్చుకుంటున్నారు.

(ఆంధ్రజ్యోతి - దువ్వూరు)



కోతుల బెడద నివారించేందుకు ఏర్పాటు చేసిన లౌడ్‌స్పీకర్



పొలంలో కోతులు పీకివేసిన పసుపు మొక్కలు

మతిస్థిమితం లేని మహిళ.. భర్తకు అప్పగింత



మహిళను భర్తకు అప్పజెబుతున్న పోలీసులు

కలసపాడు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేక గ్రామాలలో సంచరిస్తున్న రమాదేవి అనే మహిళను గురువారం రాత్రి మండల పరిధి లోని తెల్లపాడు గ్రామంలో గుర్తించారు. మహిళపై అనుమానంతో గ్రామస్థులు 112కు ఫిర్యాదు చేశారు. రాత్రి గస్తీకాస్తున్న పోలీసులు అక్కడకు చేరుకొని ఆ మహిళతో మాట్లాడి భర్తకు అప్పజెప్పారు. ఆమె చాపాడుకు చెందిన మహిళ అని పోలీసులు తెలిపారు. సకాలంలో స్పందించిన హెడ్ కానిస్టేబుల్ విజయ్‌కుమార్, కానిస్టేబుల్ అజాముద్దీన్, హోంగార్డు సుధాకర్‌లను తెల్లపాడు గ్రామస్థులు అభినందించారు.

క్రీడాకారిణికి జనసేన అభినందనలు

కడప సెవెన్‌రోడ్స్, సెప్టెంబరు 5 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్రబ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో రెండో విజేతగా నిలిచిన చిన్నారి ఆర్.రెడ్డి పద్మినిని కడప విశ్వప్రగతి చిట్‌ఫండ్ కార్యాలయంలో కడప జనసేన పార్టీ నాయకుడు తుంగా రమణయ్య అభినందించారు. క్రీడాకారిణిని శాలువతో సత్కరించి మెమెంటో అందించి రూ.5వేలు నగదు ప్రోత్సాహం అందించారు. రమణయ్య మాట్లాడుతూ యువతీ యువకులు, చిన్నారులు క్రీడారంగంలో మరింతగా రాణించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్డిపద్మిని తండ్రి బాలాజీ, కడప జిల్లా చిరంజీవి యువత అధ్యక్షుడు పంద్రా రంజిత్‌కుమార్, తిరుమలశెట్టి సిద్ధార్థ్, గాజులపల్లె శేషాద్రి, తుంగా శ్రీను తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారిణిని సత్కరిస్తున్న తుంగా రమణయ్య

భక్తిశ్రద్ధలతో చతుష్టార్చన

కడప కల్చరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తిరుమల తొలిగడప దేవుని కడపలో వెలసిన లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ పవిత్రోత్సవాలలో భాగంగా శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో చతుష్టార్చన, ద్వార తోరణ, అనంతకళాపూజ, అగ్ని ప్రతిష్ఠ, పవిత్ర ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు. కాగా సాయంత్రం 4 గంట నుంచి 6 గంటల వరకు నిత్యహోమం కార్యక్రమం నిర్వహించారు.



పవిత్రోత్సవాల దృశ్యం

దేశ ఆర్థిక పురోగతికి ఊతమిచ్చేలా జీఎస్టీ తగ్గింపు



మాట్లాడుతున్న వంగల శశిభూషణ్‌రెడ్డి

కడప మారుతీనగర్, సెప్టెంబరు 5 (ఆంధ్ర జ్యోతి): దేశ ఆర్థిక ప్రగతి కి ఊతమిచ్చేలా కేంద్ర ప్రభుత్వ ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతా రామన్ మధ్యతర గతి ప్రజలను దృష్టిలో వుంచుకుని పలు రకాల వస్తువులు, నిర్మాణ రంగ, వ్యవసాయ, ఆర్గానిక్, పరికరాలపై జీఎస్టీని 80శాతానికి తగ్గింపు చేయడం చాలా గొప్పవిషయమని భారతీయ జనతాపార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వంగల శశిభూషణ్‌రెడ్డి పేర్కొన్నారు. జీఎస్టీ ఈనెల 22నుంచి అమల్లోకి రానుందన్నారు. ఆ మేరకు శుక్రవారం స్థానిక ఎన్‌జీవో కాలనీలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే 2040 నాటికి మన దేశ ప్రజలందరికీ సామాజిక భద్రత కల్పించి తద్వారా అందరికీ మేలు చేయాలనే ఏకైక లక్ష్యంతో మోదీ జీఎస్టీ భారాన్ని కుదించారన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్, కార్యదర్శి చాగలమర్రి ఓబులేసు,సురేంద్ర, హరికృష్ణ, ప్రవీణ్ పాల్గొన్నారు.

సమాజాన్ని సన్మార్గంలో నిలబెట్టే వారే ఉపాధ్యాయులు



సన్మాన గ్రహీతలతో ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, డీఆర్ఓ విశ్వేశ్వరనాయుడు

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సమాజాన్నిసన్మార్గంలో నిలబెట్టే వారే ఉపాధ్యాయులని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం ఆఫీసర్స్ క్లబ్‌లో ఎమ్మెల్సీ ఆధ్వర్యంలో రిటైర్డ్, ప్రస్తుతం పనిచేస్తున్న ఉపాధ్యాయులను, అధ్యాపకులను ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఘనంగా సన్మానించారు. ముందుగా సర్వేపల్లె రాధాకృష్ణన్ చిత్రపటానికి ఎమ్మెల్సీతో పాటు డీఆర్ఓ విశ్వేశ్వరనాయుడు, ఆర్‌డీఓ జాన్‌ఇర్విన్ పూలమాల వేసినివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జానమద్ది విజయభాస్కర్, ప్రముఖులు పాల్గొన్నారు.

వేతనాలు ఇవ్వకుంటే అడుక్కుని తినాలా..?

కొనసాగుతున్న పారిశుధ్య కార్మికుల సమ్మె ● పనులకు దూరం ● భిక్షాటనతో నిరసన



వేంపల్లె, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఐదు నెలలుగా వేతనాలు ఇవ్వకున్నా పారిశుధ్య పనులు చేశాం, పూటగడవడం లేదు అంగడికి వెళితే సరుకులు ఇవ్వమంటున్నారు ఇక ఓపిక లేదు వేతనాలు ఇచ్చే వరకు పనులు చేయలేమంటూ వేంపల్లె మేజర్ పంచాయతీ పారిశుధ్య కార్మికులు సమ్మెకు దిగారు. గురువారం సమ్మె నోటీసు ఇచ్చిన కార్మికులు రెండు రోజులుగా పనులకు దూరంగా ఉన్నారు. వేంపల్లె పంచాయతీ పరిధిలోని ప్రధాన వీధులన్నీ చెత్తమయమయ్యాయి. ఎక్కడిచెత్త అక్కడే ఉండడంతో అస్తవ్యస్తంగా మారింది. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శుక్రవారం భిక్షాటనతో నిరసన తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యాలయం ఎదుట బైఠాయించి తమ ఆవేదన వ్యక్తం చేశారు. రెగ్యులర్ ఈఓను నియమించి సమస్యను పరిష్కరించకపోతే నీటి సరఫరా సిబ్బంది సమ్మెలోకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ బాదుల్లా, ప్రకాశం తెలిపారు. కలెక్టర్ జోక్యంచేసుకొని కార్మికుల కడుపు మండక ముందే సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో భవననిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, చల్లా బాలాజీ, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఎక్కడ చూసినా చెత్త కుప్పలే..!

వేంపల్లె, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికుల సమ్మెతో వేంపల్లె చెత్తమయమైంది. రెండు రోజులుగా పని జరగకపోవడంతో ఎక్కడి చెత్త అక్కడే, ఎక్కడి కుప్పలు అక్కడే నిలిచిపోయాయి. గాలి వీచినపుడు చెత్తా చెదారం, దారిన వెళ్లే పాదచారులు, ద్విచక్రవాహనదారుల మీదకు వస్తోంది. వేంపల్లె పంచాయతీలో అవినీతి ఆరోపణలు ఉన్న ఈఓలు సస్పెండ్ కావడం,కొత్త ఈఓ వచ్చేందుకు జంకుతుండడంతో ఐదు నెలలుగా కార్మికులకు వేతనాలు ఇవ్వలేని దుస్థితి ఏర్పడింది. విధిలేని పరిస్థితుల్లో సమ్మెకు దిగారు. దీనితో వేంపల్లెలో అపరిశుభ్రత తాండవిస్తోంది. జిల్లా అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుంటే తప్ప సమస్య కొలిక్కి వచ్చేఅవకాశం లేదు.



వేంపల్లె-కడప ప్రధాన రహదారిలో చెత్తకుప్ప

8న సీపీఐ,రైతు సంఘం రాష్ట్రవ్యాప్త ఆందోళన

కడప సెవెన్‌రోడ్స్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎరువుల కొరత పర్యవసానం, యూరియా అందుబాటులో లేకపోవడం వల్ల రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ, రైతు సంఘం ఈనెల 8న సోమవారం తలపెట్టిన రాష్ట్ర వ్యాప్త ఆందోళనలో భాగంగా తహసీల్దార్ కార్యాలలాయల వద్ద చేపట్టిన ఆందోళనను జయప్రదం చేయాలని శుక్రవారం స్థానిక పాలంపల్లెలో జరిగిన రైతుల సమావేశం లో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో యూరియా కొరత తీర్చాలని తలపెట్టిన ఆందోళనను రైతులు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి మద్దిలేటి, మల్లికార్జున, శివశంకర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

దోమ పుట్టరాదు ..కుట్టరాదు

వేముల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): దోమ పుట్టరాదు, కుట్టరాదని మలేరియా సబ్‌యూనిట్ అధికారి సిద్దయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని బెస్తవారిపల్లె గ్రామంలో ఫ్రైడే-డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. దోమ ఒక్కసారికి వంద నుంచి రెండు వందల వరకు గుడ్లుపెడుతుందన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ రమేష్, ఆరోగ్యకార్యకర్తశ్రీనివాసరావు, ఆశాకార్యకర్త లక్ష్మీదేవి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చెన్నూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో 11కేవీ విద్యుత్ లైన్లలో మరమ్మతులు కారణంగా శనివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ రామలింగారెడ్డి తెలిపారు. నిరంతరం నాణ్యమైన విద్యుత్ కావాలంటే విద్యుత్ లైన్‌ను బాగు చేస్తుండడం జరుగుతుందన్నారు. అందుకే ప్రతి నెలలో రెండోశనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

పులివెందుల, సెప్టెంబరు(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం తుంగభద్ర ప్రాజెక్టు హై లెవెల్ కెనాల్ ఛైర్మన్ జోగిరెడ్డి చేతులమీదుగా బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చెక్కులు అందించడం వల్ల ఆర్థికంగా బాధిత కుటుంబాలు ఉపశమనం పొందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉల్లిరైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

కమలాపురం రూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఉల్లి రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని సీపీఐ కమలాపురం ఏరియాకార్యదర్శి నాగేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ కమలాపురం నియోజకవర్గంలో దాదాపు వందల ఎకరాల్లో ఉల్లి సాగు చేశారని ఎకరా ఉల్లి సాగు చేయాలంటే దాదాపులక్ష వరకు ఖర్చవుతుందని ఒక్క ఎకరాకు 60 క్వింటాళ్లు దిగుబడి వస్తే ప్రస్తుత మార్కెట్ ధరలో రూ.800 నుంచి వెయ్యి వరకు కొనుగోలు చేస్తున్నారన్నారు. దీని ప్రకారం పెట్టుబడి పెట్టిన ఖర్చు కూడా రావడం లేదన్నారు. శనివారం కలెక్టరేట్ వద్ద ఉల్లి రైతుల ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఏరియా సహాయ కార్యదర్శి వరప్రసాద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వెనక్కితీసుకోవాలి

కడప సెవెన్‌రోడ్స్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాలలను, ఆరోగ్య సంరక్షణ సేవలను ప్రైవేటీకరించాలని రాష్ట్ర మంత్రివర్గం చేసిన ప్రతిపాదనలను ప్రభుత్వం వెంటనే వెనక్కు తీసుకోవాలని సీపీఎం కడప నగర కార్యదర్శి రామమోహన్ డిమాండ్ చేశారు. శుక్రవారం నాడు కడప నగరంలోని సీపీఎం ఆఫీసులో విలేకరుల సమావేశం నిర్వహించారు. విలేకరుల సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దస్తగిరిరెడ్డి, చంద్రారెడ్డి,రామకృష్ణారెడ్డి, నరసింహ పాల్గొన్నారు.

భవిష్యత్ తరాలకు గురువులు ఆదర్శప్రాయులు

కడప సెవెన్‌రోడ్స్ సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గురుపూజోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందు కున్న గురువులకు జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి శివరాం మాట్లాడుతూ విద్యారంగం లో అంకితభావంతో కృషిచేస్తూ, విద్యార్థుల్లో జ్ఞానార్జన తపనను, సామాజిక చైతన్యాన్ని పెంపొందించిన ఈ ఉత్తమ ఉపాధ్యాయులు, భవిష్యత్ తరాలకు ఆదర్శప్రాయులన్నారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు సమీర్‌బాషనగర కమిటీ ప్రధాన కార్యదర్శి నరసింహారెడ్డి,గౌరవ సలహాదారులు పిళ్లా కుమారస్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీపీపీ విధానాన్ని విరమించుకోవాలి

కడప సెవెన్‌రోడ్స్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్త మెడికల్ కళాశాలలకు సంబంధించి ఏపీ మంత్రివర్గం తీసుకున్న పీపీపీ నిర్ణయాన్ని పూర్తిగా వ్యతిరే కిస్తున్నామని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర ఆరోపించారు. కడపలో శుక్రవారం సీపీఐ కార్యాలయంలో గాలిచంద్ర విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రాష్ట్రంలో దాదాపు 17 మెడికల్ కళాశాల నిర్మాణాన్ని మొదలుపెట్టారన్నారు. అందులో పులివెందుల మెడికల్ కళాశాల ఒకటి. పులివెందులలోని మెడికల్ కళాశాల భవనాలు 90శాతం పూర్తయిందన్నారు. కూటమి ప్రభుత్వం అక్కడ భవనాలుపూర్తికాలేదు, కనీస సౌకర్యాలు లేవు, కళాశాల నిర్వహించడం ఏమాత్రం సాధ్యంకాదనడం దారుణమన్నారు.

తరగతి గది సవాళ్లు అధిగమించాలి

ఎం.ఈఓ డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య



అవార్డు గ్రహీతలతో వల్లూరు బ్రహ్మయ్య

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు తరగతి గది సవాళ్లు అధిగమించాలని ఒంటిమిట్ట ఎంఈవో డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య అన్నారు. శుక్రవారం పోతుల చిన్న ఓబుల్‌రెడ్డి, కంచమ్మ, సరస్వతమ్మ మెమోరియల్ ట్రస్ట్, రాయలసీమ టూరిజం అండ్‌కల్చరల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో కడప నగరంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆర్‌టీసీఎస్ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దనరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బ్రహ్మయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. విశిష్ట సేవలు అందిస్తున్న వివిధ మండలాలకు చెందిన ఉపాధ్యాయులను సత్కరించి మెమెంటోలు అందించారు.

గురువులను గౌరవించడం ఉత్తమ సంస్కారం

వేంపల్లె, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గురువులను గౌరవించడం ఉత్తమ సంస్కారానికి నిదర్శనమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ తులసిరెడ్డి అన్నారు. శుక్రవారం వేంపల్లెలో కాంగ్రెస్ నాయకులు ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు టీచర్లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో అలివేలమ్మ, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సుబ్రహ్మణ్యం, పులివెందుల సమన్వయకర్త ధ్రువకుమార్‌రెడ్డి, వేంపల్లె మండలశాఖ అధ్యక్షుడు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

బద్వేలు , సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి):వ్యాపారులు యూరియా, ఎరువులను ఎమ్మార్పీకే విక్రయించాలని అధిక రేట్లకు విక్రయిస్తే చర్యలు తప్పవని విజిలెన్స్ సీఐ శివన్న పేర్కొన్నారు. శుక్రవారం బద్వేలు పట్టణంలోని పలు ఎరువుల షాపులను విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అవసరమైన యూరియా సిద్ధంగా ఉందని షాపుల వారు వారిని ఇబ్బందిపెట్టకుండా చూడాలని సూచించారు. యూరియాతో పాటు రైతులకు అవసరమైన ఎరువులన్నీ సిద్ధంగా ఉన్నాయని, షాపు యజమానులు ఎవరైనా రైతులకు ఎరువులు అందించకుండా ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. యూరియా, కాంప్లెక్స్ ఎరువులపైన రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈకార్యక్రమంలో విజిలెన్స్ అధికారులు, వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గువ్వలచెరువు ఘాట్‌లో

ఆయిల్ ట్యాంకర్ బోల్తా



వేంపల్లె, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కడప రాయచోటి జాతీయరహదారిలోని గువ్వల చెరువు ఘాట్‌లో ఆయిల్ ట్యాంకర్ బోల్తా పడటంతో ట్రాఫిక్ జామ్ అయినట్లు సీకే దిన్నె పోలీసులు తెలిపారు. రాయచోటి వైపు నుంచి కడపకు వస్తున్న ఆయిల్ ట్యాంకర్ శుక్రవారం రాత్రి 10గంటలకు గువ్వలచెరువు ఘాట్ దిగుతూ మూడో మలుపు వద్ద అదుపుతప్పి బోల్తా పడటంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ట్యాంకర్‌లోని ఆయిల్ లీకై ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. కనీసం నడిచిపోయేవారు కూడా వెళ్లలేక జారిపడుతుండటంతో ట్రాఫిక్‌కు తీవ్రఇబ్బందులు ఏర్పడ్డాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఫైర్‌ఇంజన్‌తో నీళ్లు కొట్టి ఆయిల్‌ను తొలగించారు. క్రేన్ సహాయంతో లారీ ని తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు.

ఘనంగా మిలాద్-ఉన్-నబీ వేడుకలు

కడప కల్చరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి):మహమ్మద్ ప్రవక్త జన్మదినం (మిలాద్ ఉన్ నబి) అశేష జనావళికి సంతోషకర పర్వదినమని పలువురు నగరా నికి చెందిన వివిధ పార్టీల ముస్లిం నాయ కులు, నిర్వాహకులు కొనియాడారు. మిలాద్-ఉన్ నబీ- మహ్మద్ ప్రవక్త జన్మదినం సంద ర్భంగా ఆంధ్రప్రదేశ్ మార్కజీ మిలాద్ జూలీస్ కమిటీ ఆధ్వర్యంలో శుక్ర వారం నగర అగాడిలో గల ఇనాయత్‌ఖాన్ తలీం నుంచి గుంత బజార్ మసీద్ వరకూ సాగిం ది. ర్యాలీ అనంతరం గుంతబజార్ మసీద్ వద్ద రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. ముస్లిం సమైక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సలావుద్దీన్ ఆధ్వర్యంలో సర్టిఫికెట్‌తో పాటుగా గోల్డ్‌మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు అంజాద్‌బాష, టీడీపీ నాయకులు అమీర్‌బాబు, జిలానీబాష, మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

కమలాపురం రూరల్..: మహ్మద్ ప్రవక్త పుట్టినరోజు సందర్భంగా పట్టణంలో శుక్రవారం మిలాదున్‌నబీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పెద్ద దర్గా నుంచి మూడురోడ్లకూడలి వరకు బైకు ర్యాలీ, ఊరేగింపు నిర్వహించారు. ముస్లింలు, మత పెద్దలు పాల్గొన్నారు.



కడపలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

పెండ్లిమర్రి..: నందిమండలం గ్రామంలో శుక్రవారం మిలాద్ ఉన్ నబీ వేడుకలను ఘనంగా నిర్వహించారు.మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం జెండా ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించి, అన్నదానంచేశారు. మైనార్టీ నాయకులు ఖాదర్ బాషా,అలీషేర్, మహబుడ్‌పీరా,మస్తాన్, సాదక్‌వలి,ఇస్మాయిల్, బాబాఫకృద్దీన్,హుస్సేన్‌పీరా పాల్గొన్నారు.

కమనీయం...రంగనాథుని కల్యాణం

పులివెందుల రూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీరంగనాథస్వామి దేవస్థానంలో స్వామివారి నూలుపూజ పవిత్రోత్సవాల్లో భాగంగా ఆలయంలో శుక్రవారం ఆలయ ప్రధాన అర్చకుడు సోమేపల్లె కృష్ణరాజేష్‌శర్మ నేతృత్వంలో భక్తులు చల్లా వంశీయుల సహకారంతో శ్రీదేవి భూదేవి సమేతుడైన శ్రీరంగనాథ స్వామి కళ్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. మంగళవాయిద్యాల నడుమ భక్త జనసందోహంతో వేద మంత్రోచ్చారణతో కమనీయంగా స్వామివారి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. పులివెందుల పట్టణ వైసీపీ అధ్యక్షుడు వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, అంకాళమ్మ దేవస్థానం చైర్మన్ బ్యాటరీ ప్రసాద్, పెద్దిరాజు తదితరులు స్వామివారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. అనంతరం వారికి ఆలయ చైర్మన్ సుధీర్‌రెడ్డి ఘనంగా సన్మానించి తీర్థప్రసాదాలు అందించారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ఈఓ వెంకటరమణ మాట్లాడుతూ స్వామివారి నూలుపూజ మహోత్సవాలు శుక్రవారంతో ముగిశాయన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.





కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం, తిలకిస్తున్న భక్తులు

'టీడీపీలో కష్టపడే వారికి తగిన గుర్తింపు'

సింహాద్రిపురం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీలో కష్టపడే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపును పార్టీ అధినేత సీఎం చంద్రబాబు నాయుడు, పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ మారెడ్డి రవీంద్రనాథరెడ్డి(బీటెక్ రవి) ఇస్తున్నారని టీడీపీ బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు లోమడ మురళీ మోహన్ యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం ఇటీవల జెడ్పీటీసీగా ఎంపికైన మారెడ్డి లతారెడ్డి, పులివెందుల మార్కెట్ యార్డు చైర్మెన్‌గా నియమితులైన అమర్‌నాథ్‌ను మురళీ మోహన్ యాదవ్ పులివెందుల టీడీపీ కార్యాలయంలో గౌరవపూర్వకంగా కలిసి వారిని సన్మానించారు. టీడీపీ ఇప్పటికే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తూ ప్రజాదరణ పొందుతోందన్నారు.

ఉపాధ్యాయులకు సర్వేపల్లి ఆదర్శం



జమ్మలమడుగులో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను సన్మానించిన దృశ్యం



ప్రొద్దుటూరులో రాధాకృష్ణన్‌కు నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు

జమ్మలమడుగు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయులకు ఆదర్శమని వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం జమ్మలమడుగులో సర్వేపల్లి జయంతిని పురస్కరించుకుని గురుపూజోత్సవాన్ని రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షుడు వెంకటక్రిష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దిన ఉపాధ్యాయులు సమాజానికి దిశానిర్దేశకులన్నారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రోటరీ అసిస్టెంట్ గవర్నర్, న్యాయవాది మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ ఎంతో మంది ఉపాధ్యాయులు విద్యార్థుల జీవితాల్లో వెలుగు నింపారన్నారు. ఉపాధ్యాయ వృత్తికి వన్నెతెచ్చిన వారిని ఎంపిక చేసి రోటరీ క్లబ్ సంస్థ తరుపున కార్యక్రమంలో రోటరీ జోనల్ సెక్రటరి భాస్కర్, ట్రెజరర్ ఓబుళరెడ్డి, ఉపాధ్యక్షుడు మహ్మద్‌రఫి, ఎన్జీయూ సెక్రటరి గురుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గురుతర బాధ్యత ఉపాధ్యాయులదే..

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను తీర్చిదిద్దే గురుతర బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని సంస్కృతి స్వచ్ఛంద సేవా సమితి కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఎస్వీ డిగ్రీ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సమాజంలో గౌరవ మర్యాదలు పొందేలా తీర్చిదిద్దేవారే ఉపాధ్యాయులన్నారు. రాయలసీమ వ్యాయామ శిక్షణ కళాశాల రిటైర్డు ప్రిన్సిపాల్ రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ గురువులకు తరగని సంపద శిష్యులేనన్నారు. డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తల్లి దండ్రులు జన్మనిస్తే గురువులు పునర్జన్మ ఇస్తారన్నారు. అనంతరం విశ్రాంత ఉపాధ్యాయులు, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎస్ఎల్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు అంకాల్‌కొండయ్య, సాయికుమార్, గంగాధర్, ప్రభాకర్‌రెడ్డి, సుధాకర్, సుబ్బారెడ్డి పాల్గొన్నారు. స్థానిక రాణి తిరుమలదేవి డిగ్రీ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్ రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఏపీటీఎఫ్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. బోధనేతర పనుల నుంచి ఉపాధ్యాయులను మినహాయించి ఉపాధ్యాయుల గౌరవాన్ని, స్థాయిని పెంచే విధంగా ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు శ్రీనివాసరెడ్డి, నాగరాజు, సుబ్బారెడ్డి, సురేష్, వెంకటేశ్వర్లు, రామసుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విశ్రాంత ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విశిష్ట సేవలు అందించిన ఉపాధ్యాయులు, విశ్రాంత ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య మాట్లాడుతూ సమాజానికి మార్గదర్శకులు ఉపాధ్యాయులని, వారి సేవలు అమూల్యమైనవన్నారు. ఈ కార్యక్రమంలో మానవతా సేవా సంస్థ అధ్యక్షుడు ఓబుళరెడ్డి, ఛైర్మన్ కళావతి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సర్వేపల్లి జయంతి

బద్వేలు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ 137వ జయంతి, ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కోస్టగార్డుగా పని చేస్తూ పాకిస్తాన్ సైన్యం చేతిలో బందీలుగా ఉన్న 7 మంది భారత జాలర్లను చాకచక్యంగా విడిపించుకుని సీజీసీ అవార్డుకు ఎంపికైన కలసపాడు కొండపేటకు చెందిన పాలకొలను రమణారెడ్డిని బీసీ సంక్షేమ సంఘం, మాజీ సైనిక్ ఉద్యోగుల సంక్షేమ సంఘం తదితర కమిటీల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

దువ్వూరులో: గురుపూజోత్సవం సందర్భంగా దువ్వూరులో శుక్రవారం విశ్రాంత ఉపాధ్యాయులైన కొండయ్య, ఖాజావలిలను ఘనంగా సన్మానించారు. వారిలో వీరారెడ్డి, రామయ్య, రమేష్, ఈశ్వర్, బాస్కర్ ఉన్నారు.

ఎర్రగుంట్లలో: సమాజంలో ఆచార్యులదే అగ్రస్థానమని ఎంఈవో-2 రామాంజనేయరెడ్డి పేర్కొన్నారు. భారత రెండవ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి, ఉపాధ్యాయుల దినోత్సవం మానవత స్వచ్ఛంద సేవాసమితి ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన గురుపూజోత్సవంలో సర్వేపల్లి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఈవో రామాంజనేయరెడ్డి, ఉపాధ్యాయులు సుధాకర్, రామాసుబ్బారెడ్డి, ఓబులయ్య, రామాంజనేయులను మానవత సంస్థ శాలువ కప్పి, పూలమాలతో ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో మానవత కుటుంబ సభ్యులు మేడా రమేష్‌బాబు, మల్లికార్జునరెడ్డి, మధుసూధన్‌రెడ్డి, చెన్నకేశవరెడ్డి, రాఘవరెడ్డి, ఉపేంద్రరెడ్డి, సాంబశివారెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి, సురేష్, శ్రీరాములు, రామగోవిందరెడ్డి, రామసుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మైదుకూరు రూరల్‌లో: మైదుకూరు పట్టణంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని రిటైర్డు ఉద్యోగులు శుక్రవారం ఘనంగా జరుపుకొన్నారు. స్థానిక సాయినాథపురంలోని మండల ప్రజా పరిషత్ మోడల్ స్కూల్‌లో పెన్షనర్లు సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సీనియర్ రిటైర్డు ఉపాధ్యాయులైన ఏవీ సుబ్బన్న, దేవదానంలను శాలువ, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు చిగురుపాటి సుబ్బరాయుడు, ఏవీ రమణ, ఓబన్న, ఖాజాహుసేన్, చలమయ్య, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలసపాడులో: మండలంలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కలసపాడు, కరణంవారిపల్లె, ఎగువరామాపురం తదితర గ్రామాల్లోని పాఠశాలల్లో డాక్టర్ సర్వేపల్లె రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రిటైర్డ్ ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.



ఎర్రగుంట్లలో ఎంఈవో, ఉపాధ్యాయులను సన్మానిస్తున్న మానవత బృందం



ప్రొద్దుటూరులో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దృశ్యం



మైదుకూరులో సర్వేపల్లికి ఘననివాళి

వేపరాలలో 10 నుంచి జ్యోతి మహోత్సవాలు

మైలవరం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తొగటవీర క్షత్రియుల ఆరాధ్య దైవమైన చౌడేశ్వరీదేవి జ్యోతి మహోత్సవాలు ఈనెల 10న నిర్వహించడం జరుగుతుందని వేపరాల దేవాలయ కమిటీ, గ్రామపెద్దలు శుక్రవారం తెలిపారు. 10వ తేదీ బుధవారం అమ్మవారికి పంచామృతాభిషేకం, మహామంగళ హారతి, బిందెసేవ, అమ్మవారి గుడి నందు ప్రసాద పంపిణీ, అమ్మవారి తొట్టిమెరువని, గ్రామంలో జ్యోతుల కార్యక్రమం, కోలాటం ఉంటుందన్నారు. 11వ తేదీ గురువారం జ్యోతుల మహోత్సవం, 12వ తేదీ శుక్రవారం గొడుగుల కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని దేవాలయ కమిటీ, గ్రామపెద్దలు తెలిపారు.

వ్యవసాయ కార్మిక సంఘ సమావేశాలు

బ్రహ్మంగారిమఠం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ సమావేశాలు సెప్టెంబరు 8, 9, 10తేదీల్లో కడపలో నిర్వహిస్తున్నట్లు సంఘం నేతలు పేర్కొన్నారు. శుక్రవారం బ్రహ్మంగారి మఠం సుందరయ్యభవన్‌లో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కరపత్రాలు విడుదల చేశారు. మండల కార్యదర్శి గోవిందు, నాయకులు సునీల్‌కుమార్ ఆంజనేయులు, నరసింహులు, అరవింద్ పాల్గొన్నారు.

ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



ఎరువుల దుకాణాలను తనిఖీ చేస్తున్న అధికారులు

బద్వేలు , సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వ్యాపారులు యూరియా, ఎరువులను ఎమ్మార్పీకే విక్రయించాలని అధిక రేట్లకు విక్రయిస్తే చర్యలు తప్పవని విజిలెన్స్ సీఐ శివన్న పేర్కొన్నారు. శుక్రవారం బద్వేలు పట్టణంలోని పలు ఎరువుల షాపులను విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షాపుల వారు రైతులకు అవసరమైన యూరియా సిద్ధంగా ఉందని వారిని ఇబ్బందిపెట్టకుండా చూడాలని సూచించారు. యూరియాతోపాటు రైతులకు అవసరమైన ఎరువులన్నీ సిద్ధంగా ఉన్నాయని, షాపు యజమానులు ఎవరైనా రైతులకు ఎరువులు అందించకుండా ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. యూరియా, కాంప్లెక్స్ ఎరువులపైన రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈకార్యక్రమంలో విజిలెన్స్ అధికారులు, వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు సరిగాలేవంటూ ప్రజల నిరసన

పోరుమామిళ్ల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సింగరాయకొండ, ముదిరెడ్డిపల్లె మీదుగా జరుగుతున్న జాతీయ రహదారి రోడ్డు విస్తరణ పనులు సరిగాలేవంటూ కొండుగారిపల్లె గ్రామస్థులు నిరసన చేపట్టారు. శుక్రవారం ఆ గ్రామంలోని కొందరు రోడ్డు విస్తరణ పనుల్లో జరుగుతున్న కొలతల్లో ఒక వైపు ఒక రకంగా, ఇంకో వైపు మరో రకంగా కొలతలు వేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ముదిరెడ్డిపల్లె నుంచి నెల్లూరు సరిహద్దు వరకు జరుగుతున్న ప్యాకేజీ పనులకు సంబంధించి కొండుగారిపల్లె వద్ద . పదిమీటర్ల వెడల్పుతోపాటు డ్రైనేజీ పైపులైను మొత్తం 20 మీటర్ల వెడల్పుతో పనులు జరగాల్సి ఉండగా ఒకవైపు తక్కువగా మరో వైపు ఎక్కువగా వేస్తునారని గ్రామస్థులు ఆరోపించారు. ఈ విషయంపై సంబంధిత అధికారి నారాయణనాయక్‌ను వివరణ కోరగా, కొలతలు ప్రకారమే తాము నిర్మాణాలు చేపడుతున్నామని మొత్తం 20 మీటర్ల వెడల్పులో పదిమీటర్ల రోడ్డు, మిగిలిన పది మీటర్లు రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ కాల్వలు, పైపులైను, విద్యుత్‌స్తంభాలు ఏర్పాటు చేసేలా నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవ ప్రదమైనది



వైష్ణవి స్కూలులో పాఠశాల ఫౌండర్ రామానుజులును సన్మానిస్తున్న విద్యార్థులు

పోరుమామిళ్ల, సెప్టెంబరు5 (ఆంధ్రజ్యోతి): అన్నిరంగాల్లో ఉన్న వృత్తుల్లో కెల్లా ఉపాధ్యాయ వృత్తి గౌరవ ప్రదమైనదని వైష్ణవి పాఠశాల ఫౌండర్ ఆర్‌వీ రామాంజులు అన్నారు. శుక్రవారం పోరుమామిళ్లలోని శ్రీవైష్ణవి ఇంగ్లీషు మీడియం హైస్కూలులో మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి వేడుకలు ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భారత పురాణ ఇతిహాసాలు గురువుకు ప్రత్యేక స్థానం కల్పించిందన్నారు. ఆధునిక కాలంలో ఈ వృత్తికి ఎంతో ప్రత్యేక స్థానాన్ని డాక్టర్ సర్వేపల్లె రాధాకృష్ణన్ తెచ్చిపెట్టారన్నారు. కరస్పాండెంట్ రామక్రిష్ణ మాట్లాడుతూ తల్లి తండ్రి తరువాత స్థానం గురువుకే ఇవ్వడం ఎంతో ప్రత్యేకత సంతరించుకుందన్నారు. సమాజ నిర్మాణం పాఠశాలలోనే రూపుదిద్దుకుంటుందన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులకు మార్గదర్శకంగా ఉంటే విద్యార్థులు తమకు తామే అభివృద్ధి చెందుతారన్నారు. అనంతరం విద్యార్థులు ఉపాధ్యాయులను సన్మానించి తమ గురుభక్తిని చాటుకున్నారు. ఫౌండర్ రామానుజులును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కళ్యాణి, పాఠశాల ఇన్‌చార్జి కేశవరాయుడు, వైస్ ప్రిన్సిపాల్ నమిత పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో: అలాగే ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు గురుపూజోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు శ్రీనివాసులరెడ్డి, భూపాల్‌రెడ్డి, సీతారామిరెడ్డి పాల్గొన్నారు.

పేద బాలుడికి ఉపాధ్యాయుడి ఆర్థిక సాయం

బద్వేలు , సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని త్యాగరాజు కాలనీకి చెందిన వింత వ్యాధితో బాధపడుతున్న మురుగన్ అనే బాలునికి వైద్య ఖర్చుల కోసం శుక్రవారం ఉపాధ్యాయుడు పట్టెం వెంకటసుబ్బారెడ్డి రూ.5 వేలు ఆర్థిక సహాయం అందించారు. గతంలోకూడా దాదాపు రూ.55వేలు వరకు ఉపాధ్యాయుడు ఆ బాలుడి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందించారు. బాలుడి ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా పెన్షన్ అందించాలని తల్లిదండ్రులతో పాటు పలువురు కోరుతున్నారు.

కీటకజనిత వ్యాధులపై తగు జాగ్రత్త వహించాలి

బద్వేలు రూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కీటక జనిత వ్యాధులు ప్రబలకుండా ప్రజలు తగు జాగ్రత్త వహించాలని సబ్ యూనిట్ అధికారులు నరసింహారెడ్డి, సుబ్బరాయుడులు పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వెంకటాద్రినగర్, రామాంజనేయనగర్‌లలో ఆశా, ఏఎన్ఎంలతో ఇంటింటి లార్వా, ఫీవర్ సర్వే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దోమ కాటుకు గురికాకుండా ముందు జాగ్రత్త చర్యగా ప్రజలు దోమతెరలు వాడాలని, ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడేలో భాగంగా నీరు నిల్వ ఉన్న తొట్లను, కూలర్లను శుభ్రపరచుకోవాలన్నారు. ఏఎన్ఎంలు, ఎంపీహెచ్ఏలు ప్రతినిత్యం గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలకందుబాటులో ఉంటూ జ్వరాలు సోకినవారిని వెంటనే పీహెచ్‌సీకి పంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, హెల్త్ అసిస్టెంటు జనార్ధనరావు, వెంకటసుబ్బయ్య, నాగేశ్వర్‌రావు, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

గ్రంథాలయ డైరెక్టర్ లక్ష్మిరెడ్డికి సన్మానం

ఖాజీపేట, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ డైరెక్టర్‌గా ఎన్నికైన తిప్పిరెడ్డి లక్ష్మిరెడ్డిని టీడీపీ నాయకులు శుక్రవారం ఆయన స్వగృహంలో కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా టీడీపీ నేతలు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో కష్టపడేవారికి పదవులు వస్తాయని, గత అసెంబ్లీ ఎన్నికల్లో మండల చరిత్రను తిరగరాశినందుకు లక్ష్మిరెడ్డి ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొగ్గుల చంద్ర ఓబుళరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, హరనాథరెడ్డి, భాస్కర్‌రెడ్డి, రవి, ఫరూక్, నంద్యాల సుబ్బయ్య, జెండాల మాబాష, పుల్లయ్యనాయుడు, శంకర్‌రెడ్డి, హబీబ్, ఇండ్ల సుబ్బారెడ్డి, వాకమల్ల వెంకటరామిరెడ్డి, బుచ్చిరెడ్డి, శ్రీనివాసులు, ఆదినారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఖాజీపేట ముస్లిం నాయకులు లక్ష్మిరెడ్డిని ఘనంగా సన్మానించి కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ప్రవక్త చూపిన బాటలో నడవాలి

- పీఠాధిపతులు షాదిక్‌పాషా ఖాద్రి, గౌస్‌పీరాఖాద్రి వెల్లడి



ప్రభుత్వ ఆస్పత్రిలో పండ్లు పంపిణీచేస్తున్న దృశ్యం

జమ్మలమడుగు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మహమ్మద్ ప్రవక్త చూపిన బాటలో నడుస్తూ మంచి చేయాలని జామియా మసీదు పీఠాధిపతి షాదిక్‌పాషా ఖాద్రి, గౌషియా మకాన్ ప్రభుత్వ ఖ్వాజీ, పీఠాధిపతి గౌస్ పీరా ఖాద్రి సూచించారు. శుక్రవారం మొదట జమ్మలమడుగులో పోలీసు అధికారులు ఇచ్చిన సూచనల మేరకు జామియా మసీదు పీఠాధిపతి ఆధ్వర్యంలో మిలాదున్ నబి ర్యాలీ ప్రశాంతంగా నిర్వహించారు. వారి వెంట మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి పాల్గొన్నారు. పీఠాధిపతి షాదిక్‌పాషా ఖాద్రి మాట్లాడుతూ సమాజంలో తప్పు జరుగకుండా మంచి మార్గంలో నడవాలని కోరారు. సఖ్యత భావంతో ఎలాంటి గొడవలు లేకుండా మెలగాలన్నారు. అనంతరం రాత్రి మసీదు వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే పలగాడి సెంటర్ గౌషియా పెద్ద మకాన్ వద్ద నుంచి గౌషియా పీఠాధిపతి గౌస్‌పీరాఖాద్రి, ఆయన కుమారుడు తాహీర్‌పీరా ఖాద్రి, కమిటీవారు జమ్మలమడుగు, మైలవరం, ముద్దనూరు, దొమ్మరనంద్యాల తదితర ప్రాంతాల నుంచి భారీగా శిష్య బృందం మిలాదున్ నబి శాంతి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రి, సబ్‌జైలు నందు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. గౌషియా షాదీఖానాలో పెద్ద మకాన్ వద్ద అన్నదానం నిర్వహించారు. మిలాదున్ నబి శాంతి ర్యాలీ ప్రశాంతంగా జరుపుటకు డీఎస్పీ వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు అర్బన్ సీఐ నరేష్‌బాబు, ఎస్ఐలు రామకృష్ణ, సుబ్బారావు, మధు, సుమారు 70 మంది పోలీసులు పాల్గొన్నారు.

ఘనంగా మిలాద్-ఉన్-నబీ



ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా ముస్లింలు మిలాదు-ఉన్ నబీ పండుగను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం అంజుమన్ అహలే ఇస్లాం ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంజుమన్ అహలే ఇస్లాం కమిటీ అధ్యక్షుడు వీఎస్ ముక్తియార్ మాట్లాడుతూ మహ్మద్‌ప్రవక్త జన్మదినాన్ని పురష్కరించుకుని మిలాద్-ఉన్‌నబీ పండుగను నిర్వహించుకుంటున్నామన్నారు. ప్రవక్త బోధనలు మానవాళికి అనుసరనీయమని సూచించారు. కార్యక్రమంలో పట్టణంలోని వివిధ మసీదు కమిటీల ప్రతినిధులు, అంజుమన్ అహలే ఇస్లాం కమిటీ సభ్యులు, మత పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

కొండాపురంలో: పట్టణంలోని మసీదులో మిలాద్-ఉన్‌నబీ వేడుకలను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. మహమ్మద్ ప్రవక్త పుట్టిన రోజైన ఈ పండుగ సందర్భంగా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఈ సందర్భంగా అన్నదానం చేశారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

పోరుమామిళ్లలో : మిలాద్-ఉన్ నబీ వేడుకలు పోరుమామిళ్లలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా శుక్రవారం రంగసముద్రం పంచాయతీ పరిధిలోని మహబూబ్‌నగర్‌కాలనీలో ముస్లింలు, మత పెద్దలు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మత పెద్దలు మిలాద్-ఉన్‌నబీ వేడుకల గురించి వివరించారు.

దువ్వూరులో: దువ్వూరులో శుక్రవారం ముస్లింలు మిలాద్ -ఉన్ నబీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు వెంట శాంతి ర్యాలీ చేపట్టారు. మహమ్మద్ ప్రవక్త బోధనలు వినిపించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

మహిళల సహకారంతోనే కూటమికి అధికారం

- ఇచ్చిన హామీలు అమలు చేయడం చంద్రబాబుకే సాధ్యం
- స్త్రీ శక్తి సమావేశంలో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ అరాచక పాలనను తరిమి కొట్టి కూటమిని అధికారంలోకి తేవడం లో మహిళల పాత్ర కీలకమైనదని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక అభ్యాస్ జూనియర్ కాలేజీ ఆవరణలో ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు ముఖ్యంగా మహిళలకు ఇచ్చిన సూపర్‌సిక్స్ పథకాలు అన్ని సక్సెస్ అయిన సందర్భంగా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇచ్చిన హామీలను అమలు చేయడం చంద్రబాబుకే సాధ్యమన్నారు. ఆయన సంక్షేమంతో పాటు అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లి రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రగా మార్చగలడన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొండారెడ్డి మాట్లాడుతూ పింఛన్లను ఒకేసారి రూ 4వేలు పెంచి వృద్ధులకు, దివ్యాంగులకు వితంతువులను ఆదుకుంటున్నాడన్నారు. ఉచితంగా మూడు సిలిండర్లు అందిస్తున్నారన్నారు. స్కూలు తెరవంగానే ఇంట్లో ఎంతమంది ఉంటే అందరికి తల్లికి వందనం అందజేస్తున్నాడన్నారు, అసాధ్యమనుకున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సాధ్యమం చేసి చూపారన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ మున్సిపల్ ఛైర్మన్ వీఎస్ ముక్తియార్, మాజీ ఎంపీపీ రాఘవరెడ్డి, టౌన్ బ్యాంకు ఛైర్మన్ సుబ్బారెడ్డి, వాల్మీకి బోయ కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల నాగరాజు, మున్సిపల్ కౌన్సిల్లర్లు వంగనూరు మురళీధర్‌రెడ్డి , గాజుల జ్యోతి, జంబాపురం వెంకటలక్ష్మీ, మాజీ కౌన్సిలరు నూర్జహాన్, టీడీపీ మహిళా నేతలు బోగా శివకళ్యాణి ,లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

మదర్‌థెరిస్సా చేసిన సేవలు అద్వితీయం



అనాథాశ్రమంలోని చిన్నారులకు పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

బద్వేలు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సమాజానికి మదర్‌థెరిస్సా చేసిన సేవలు అద్వితీయమని వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం మదర్ థెరిస్సా వర్థంతిని పురస్కరించుకుని షాలోమ్ అనాథాశ్రమంలో మదర్ థెరిసా దివ్యాంగుల సేవా సంఘం ఆధ్వర్యంలో అనాథ పిల్లలకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రసన్నకుమార్ మాట్లాడుతూ దేశానికి థెరిస్సాచేసిన సేవలు అమోఘమన్నారు. నేటికి మనం ఆమెను మనం గుర్తుంచుకున్నామంటే అందుకు ఆమె చేసిన సేవలే కారణమన్నారు. అందుకే ఆమెను భారతరత్న వరించిందన్నారు. ఆమెను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ తమ చేతనైన సహాయం చేయాలన్నారు. కార్యక్రమంలో వెంకటరమణ, దివ్యాంగులు వెంకట సుబ్బయ్య, ముత్యాల రమణ, ఖాదర్‌బాష, బాబు, మన్యం కేశవయ్య, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

బి.మఠం మండల అభివృద్ధే ఎమ్మెల్యే లక్ష్యం



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న సింగిల్‌విండో ఛైర్మన్ సాంబశివారెడ్డి

బ్రహ్మంగారిమఠం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు నియోజకవర్గంలోని బ్రహ్మంగారిమఠం మండల అభివృద్ధే ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ లక్ష్య మని సింగిల్‌విండో ఛైర్మన్ యల్లటూరు సాంబశివారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని సోమిరెడ్డిపల్లె పంచాయతీ కొండుగారిపల్లె గ్రామంలో రూ.10లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణాన్ని ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లె సుబ్బారెడ్డి, సింగిల్‌విండో ఛైర్మన్ ప్రారంభించారు. ఈసందర్భంగా సింగిల్‌విండో ఛైర్మన్ మాట్లాడుతూ మండల అభివృద్ధి కోసం ఎమ్మెల్యే కృషి చేస్తున్నారని, రాబోవు రోజుల్లో ఆదర్శ మండలంగా ఎమ్మెల్యే తీర్చిదిద్దుతారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నేతలు, పీఆర్ ఏఈ మురళీధర్‌రెడ్డి, ఇంజనీరింగ్ అసిస్టెంటు అశోక్ పాల్గొన్నారు.